RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, మే 1, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 24 | పేజీలు: 8 | వెల : రూ.1




**మే చివరి వారంకానీ జూన్‌లో పంచాయితీ పోల్స్‌కు ఏర్పాట్లు**



## పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి నమోదవుతున్నాయి. నలభై ఏడు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళనకు దారి తీసింది. ఏప్రిల్ నెల చివరి మాసంలోనే ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటుందన్న దానిపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని మరికొన్ని రోజులు ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన అకాల వర్షాల కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏపీలో మొత్తం 28 జిల్లాలకు గాను 16 జిల్లాల పరిధిలోని 88 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండి 41 డిగ్రీలకు పైగా నమోదైనట్లు

(మిగతా 2వ పేజీలో)

# ఇవాళ్టి నుంచి సర్కారీ మెట్రో



హైదరాబాద్, ఏప్రిల్ 30, ( వాయిస్ టుడే ) : హైదరాబాద్ మహానగర ముఖ చిత్రాన్ని మార్చేసిన లక్షలాది మందికి చేరువైన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో ఒక కీలక అధ్యాయం ముగిసింది. ఇన్నాళ్లూ ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం కింద లార్సన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ) నిర్వహణలో ఉన్న మెట్రో మొదటి దశ, ఇప్పుడు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ వశమైంది. దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోగా మెట్రో పగ్గాలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చింది.. ఎల్ అండ్ టీ మెట్రో రైలు లిమిటెడ్‌లో ఉన్న మొత్తం వంద శాతం ఈక్విటీని 1, 461.47 కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ఒప్పంద పత్రాలపై హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ ప్రతినిధి డీకే సేన్, ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణరావు, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మెట్రో మాజీ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సాక్షులుగా ఉన్నారు అంతకు ముందు ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ ప్రక్రియపై

(మిగతా 2వ పేజీలో)



# రాష్ట్ర సేన నుంచి రక్షణ సేనగా మార్పు

### ::: గుడ్ న్యూస్ చెప్పిన సీఈసీ

హైదరాబాద్, ఏప్రిల్ 30, (వాయిస్‌టుడే) : కొత్త పార్టీతో ప్రజల పరీక్ష ఎదుర్కోవడానికి సిద్ధమైన కవితకు ఎన్నికల సంఘం గుడ్ న్యూస్ చెప్పింది. అయితే తెలంగాణ రాష్ట్ర సేనను కాస్త రక్షణ సేనగా మార్చిన తర్వాత టీఆర్ఎస్‌ను రాజకీయ పార్టీగా గుర్తించేందుకు అంగీకరించింది. ఈ మేరకు ప్రక్రియ పూర్తి చేసి అంగీకార పత్రాలను కవితకు అందజేశారు. గతంలో కవిత ఇచ్చిన ఆప్షన్స్‌లో ఇది కూడా ఉండటంతో ఆమె కూడా అభ్యంతరం చెప్పలేదు. భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన మాజీ ఎమ్మెల్సీ కవిత [illegible] పేరుతో కొత్త రాజకీయ పార్టీ పెట్టారు. ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ధ్యేయంగా సామాజిక తెలంగాణ ఆకాంక్షల కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు చెప్పారు. దీనికి ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు రాదని బీఆర్ఎస్ నేతలు చెప్పారు. పెద్ద హిస్టరీ ఉన్న పార్టీలు పేర్లు పెట్టుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వదని కూడా ప్రచారం చేశారు. కానీ వారికి షాక్ ఇస్తూ ఎన్నికల సంఘం టీఆర్ఎస్‌కు గుర్తింపు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. నేరుగా

(మిగతా 2వ పేజీలో)



## యాక్షన్ మోడ్‌లోకి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 30, ( వాయిస్ టుడే ) : రంగంలోకి కేటీఆర్.. ఫస్ట్ స్టెప్‌లోనే సంచలన నిర్ణయం! బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు.. సంపూర్ణ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన 24 గంటల్లోనే కేటీఆర్ రంగంలోకి దిగిపోయారు. బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు.. సంపూర్ణ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన 24 గంటల్లోనే కేటీఆర్ రంగంలోకి దిగిపోయారు. రాష్ట్ర స్థాయి కమిటీని అలానే ఉంచి.. జిల్లా, మండల స్థాయి కమిటీలను వెంటనే రద్దు చేశారు. ఇదేసమయంలో తన విచక్షణ మేరకు కీలక నేతలను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో తొలి అడుగుగా.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై కేటీఆర్ దృష్టి పెట్టారు. దీనిలో జరిగే అవకతవకలను గుర్తించే బాధ్యతను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌కు అప్పగించారు.హైదరాబాద్, సికింద్రాబాద్‌లో చేపట్టిన సర్ ప్రక్రియలో అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీలు చేతులు కలిపే ప్రమాదం ఉందని.. బీఆర్ ఎస్ అనుకూల ఓట్లను తొలగించే అవకాశం ఉందని కేటీఆర్ అంచనా వేశారు. ఈ క్రమంలో నకిలీ ఓట్లు, దొంగ ఓట్లను గుర్తించడం తోపాటు.. బీఆర్ ఎస్ అనుకూల ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించకుండా చూడాలని తలసానికి కేటీఆర్ సూచించారు. దీనికి సంబంధించి పార్టీ తరఫున కార్యకర్తలను నియమించుకుని పర్యవేక్షించే అవకాశం ఆయనకు కల్పించారు. ఏ ఒక్క బీఆర్ ఎస్ సానుకూల ఓటు కూడా పోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు.గత ఏడాది జరిగిన.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికలో బీఆర్ ఎస్ అనుకూల ఓట్లను తొలగించారని.. అందుకే తాము నష్టపోయామని చెప్పారు. ఈ నేపథ్యంలో గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సర్ ప్రక్రియను అత్యంత నిశితంగా పరిశీలించాలని

(మిగతా 2వ పేజీలో)

# ఇవాళ్టి నుంచి భారీగా రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ



హైదరాబాద్, ఏప్రిల్ 30, (వాయిస్‌టుడే) : తెలంగాణలో స్థిరాస్తి కొనుగోలు చేయాలనుకునే వారికి బ్యాడ్ న్యూస్. మే 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకునేందుకు సిద్ధమైంది. అపార్ట్‌మెంట్ అయినా, ప్లాట్ అయినా, వ్యవసాయ భూమి అయినా.. ఇకపై మీ జేబుకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఆస్తుల మార్కెట్ విలువలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మే మొదటి వారం నుంచే అమల్లోకి రానుంది. ఈ మార్పుతో రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ భారం ఒక్కసారిగా పెరగనుంది.రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన కేబినెట్ ఉపసంఘం ఇటీవల సచివాలయంలో కీలక భేటీ నిర్వహించింది. రాష్ట్ర ఆదాయ మార్గాలను పెంచుకోవడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో.. ఆస్తుల మార్కెట్ విలువల సవరణకు పచ్చజెండా ఊపారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ ధరలకు, ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ధరలకు మధ్య పొంతన లేకపోవడాన్ని గమనించిన ప్రభుత్వం, ఈ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా కొత్త రేట్లను సిద్ధం చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ఆదేశించింది.ప్రభుత్వ అంచనాల ప్రకారం, ఈ విలువల సవరణ ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు అదనంగా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూరనుంది. కేవలం ఆదాయం మాత్రమే కాకుండా,

(మిగతా 2వ పేజీలో)

# బీజేపీ టార్గెట్ తెలంగాణ

### భారీ సభకు కమలం కసరత్తు



హైదరాబాద్, ఏప్రిల్ 30 : తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ సానుకూల ఫలితాలను ఆశిస్తోంది. ఈ ఫలితాలు వెలువడిన వారం రోజుల్లోనే ప్రధాని నరేంద్ర మోదీని రంగంలోకి దించి, తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టించాలని అధిష్టానం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ పర్యటనలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జనాగ్రహ సభను కూడా ఖరారు చేసింది. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ప్రజల అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని పార్టీ భావిస్తోంది.ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ఫలితాలపై బీజేపీ భారీ ఆశలు పెట్టుకుంది. ఒకవేళ బెంగాల్ గడ్డపై కాషాయ జెండా ఎగిరితే, ఆ ఉత్సాహం తెలంగాణ బీజేపీ నేతల్లో రెట్టింపు కానుంది. బెంగాల్ విజయం ఇక్కడి కేడర్‌లో కొత్త రక్తం నింపుతుందని, ఆ ఊపుతోనే మిషన్ తెలంగాణ ను వేగవంతం చేయవచ్చని అమిత్ షా వంటి అగ్రనేతలు భావిస్తున్నారు. బెంగాల్ వంటి బలమైన ప్రాంతీయ శక్తి ఉన్న రాష్ట్రంలోనే గెలవగలిగితే, తెలంగాణలో కేసీఆర్ మార్కు రాజకీయాలను ఎదుర్కోవడం కష్టం కాదనే సంకేతాలను మోదీ సభ ద్వారా

(మిగతా 2వ పేజీలో)



# ఏపీకి 11,056 కోట్లు..

### ఇదీ బాబు మార్క్ పరిపాలన.. సంపద..

విజయవాడ, ఏప్రిల్ 30, ( వాయిస్ టుడే ) : ఒక ఎకో సిస్టం డెవలప్ కావాలంటే అక్కడ అనుకూల పరిస్థితులు సృష్టించాలి. అవి సృష్టించాలంటే అక్కడి నాయకత్వానికి దూర దృష్టి ఉండాలి. అలాంటి దూర దృష్టి ఉన్న నాయకుడు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయగలడు. దానికోసం అవకాశాలను సృష్టించగలడు. అంతిమంగా ఆ ప్రాంతాలను గొప్పగా వృద్ధి చేయించగలడు. అలాంటి నాయకుడే ఇప్పుడు ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన దార్శనికత వల్ల ఏపీ కథ మొత్తం మారిపోయింది.ఏ ప్రభుత్వానికైనా ఆదాయం అత్యంత అవసరం. ఎందుకంటే ఆదాయం ఉంటేనే అభివృద్ధి పనులు చేయడానికి సాధ్యమవుతుంది. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీలవుతుంది. ఆదాయం రావాలంటే

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

శుక్రవారం, మే 1, 2026

# ఇవాళ్టి నుంచి సర్కారీ మెట్రో


చర్చించారు. మెట్రోను స్వాధీనం చేసుకోవడంలో కేవలం వాటాలను కొనుగోలు మాత్రమే కాకుండా భారీ ఆర్థిక బాధ్యతలను కూడా ప్రభుత్వం స్వీకరించింది. ఏప్రిల్ 30, 2026 నాటికి ఎల్ అండ్ టీ మెట్రోపై ఉన్న 13, 538.53 కోట్ల అప్పును ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేయనున్నారు. ఈ లావాదేవీ పూర్తి అయిన తర్వాత ఎల్ అండ్‌టీ ఈ మెట్రో ప్రాజెక్టుతో ఎటువంటి అనుబంధం ఉండదు. ఈ ప్రక్రియ జూన్ 30 నాటికి పూర్తి కావచ్చని అంచనా. ఈ భారీ లావాదేవీకి ఐడీబీఐ క్యాపిటల్ టాన్సాక్షన్ అడ్వైజర్‌గా, సరఫ్ అండ్ పార్టనర్స్ లీగల్ అడ్వైజరీగా వ్యవహరించాయి. హైదరాబాద్ మెట్రో ప్రయాణం 2010లో ప్రారంభమైంది. మొదట మేటాస్ కన్సార్షియం ఈ టెండర్ పొందినా, సత్యం కుంభకోణం తర్వాత అది రద్దు అయ్యింది. 2010లో జరిగిన రెండో టెండర్లలో ఎల్ అండ్ టీ అత్యంత తక్కువ కోట్ చేసి ప్రాజెక్టును దక్కించుకుంది. అప్పట్లో ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది. 71 కిలోమీటర్ల మేర ప్రాజెక్టు అంచనా వ్యయం మొదట 12, 132 కోట్లు కాగా, పూర్తి అయ్యే సరికి ఇది పెరిగింది. బ్యాంకుల నుంచి 11, 478 కోట్ల రుణం, ఎల్ అండ్ టీ వాటా 3,440 కోట్లుగా ఉంది. మొదటి దశ 2017నవంబర్ 29న ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 69.2 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లలో సేవలు అందుతున్నాయి.



### ప్రభుత్వ స్వాధీన నిర్ణయానికి కారణాలు ఇవే

ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగడానికి, ప్రభుత్వం దీనిని స్వీకరించడానికి బలమైన కారణాలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో ఆరు నెలలపాటు మెట్రో నిలిచిపోవడంతో ప్రాజెక్టు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. ప్రభుత్వం అప్పట్లో 900 కోట్ల వడ్డీ లేని రుణాన్ని కూడా ఇచ్చింది. మొదట 35 ఏళ్ల ఒప్పందం ఉండగా, దానిని 2072 వరకు అంటే మరో పాతికేళ్లు పొడిగించారు. అయితే ఆర్థిక ఒత్తిడి కారణంగా ఎల్ అండ్ టీ తప్పుకోవాలని భావించింది. మొదటి దశ ప్రైవేటు వద్ద, రెండో దశ ప్రభుత్వం వద్ద ఉంటే నిర్వహణలో ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వం భావించింది. ఇప్పుడు రెండు దశలూ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉండటం వల్ల సమగ్ర రవాణా వ్యవస్థను నిర్మించడం సులభమవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో నిత్యం సగటున 4.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు 86 కోట్ల ప్రయాణాలు నమోదు అయ్యాయి. మెట్రో ప్రభుత్వపరమవ్వడం వల్ల భవిష్యత్‌లో కొత్త మెట్రో లైన్ల నిర్మాణం పాత కారిడార్ల అనుసంధానం వేగవంతం అవుతుంది. ప్రయాణికుల అవసరాలు అనుగుణంగా ఛార్జీలు, సమయపాలన, ఇతర సదుపాయాలపై ప్రభుత్వం పూర్తి నిర్ణయాధికారం కలిగి ఉంటుంది. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన ఫ్యూచర్ సిటీకి మెట్రోను అనుసంధానించే ప్రక్రియ మరింత సులభతరం చేయవచ్చు.

# ఏపీకి 11,056 కోట్లు..



ప్రజల్లో నమ్మకం పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలి. అప్పుడే ఆర్థిక వృద్ధి.. అభివృద్ధి సాధ్యమవుతుంది.. ఏపీ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.. ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు ఏపీ రాష్ట్రంలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉండేది. అప్పులు మాత్రం దారుణంగా ఉండేది. ఈ క్రమంలో నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తన అనుభవాన్ని మొత్తం రంగరించారు. ఫలితంగా ఏపీ రాష్ట్ర అభివృద్ధి బాట పట్టింది.ఏపీ రాష్ట్రానికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయాన్ని పరిశీలనకు తీసుకుంటే.. గత ఆర్థిక సంవత్సరం అద్భుతమైన వృద్ధి కనిపించింది. అంతకుముందు ఏడాదితో పోల్చి చూస్తే ఇది ఏకంగా 25% ఎక్కువ. బడ్జెట్ అంచనాలను దాదాపు 98.4% సాధించింది. 2024-2025లో 8, 847 కోట్లుగా ఉన్న ఆదాయం.. 2025-26 లో 11,056 కోట్లకు చేరుకుంది. డిజిటల్ విధానం, పరిపాలన సంస్కరణల వల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పెరుగుదల కనిపించింది.. ఈ స్థాయిలో ఆదాయం సాధించడం అంటే మామూలు విషయం కాదు.. పైగా ఇంతటి వృద్ధి అన్ని రకాల వసతులు ఉన్న రాష్ట్రాల్లో కూడా సాధ్యం కాలేదు. కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడం.. రాజధాని నగరంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతూ ఉండడం.. ప్రభుత్వపరంగా సానుకూల నిర్ణయాలు కనిపిస్తూ ఉండడంతో.. ఏపీ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం అమాంతం దూసుకుపోయింది.. ఇదే జోరు గనుక కొనసాగితే వచ్చే రోజుల్లో కూడా ఆదాయం మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు"ఆంధ్రప్రదేశ్లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఒకప్పటి మాదిరిగా ఒత్తిడి లేదు. అన్ని అనుమతులు త్వరగానే వస్తున్నాయి. భూమి కేటాయింపులు కూడా జరిగిపోతున్నాయి.. ప్రభుత్వం రంగంలోకి దిగి అన్ని రకాల అనుమతులు త్వరగానే లభించేలా చేస్తుంది. ముఖ్యంగా డిజిటల్ విధానంలో భూ వ్యవహారాలు సాగుతున్నాయి. దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోతున్నాయి. ఇవి మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని" భూములు కొనుగోలు చేస్తున్న వారు అంటున్నారు.

### గ్లోబల్ క్యాపిటల్ గా విశాఖ

విశాఖపట్నం ప్రాంతాన్ని పర్యాటకంగానే ఇప్పటిదాకా చూశారు. అయితే ఆ నగరంలో మరో కోణాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. అందువల్లే ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. 2014 నుంచి 2019 వరకు విశాఖపట్నంలో విస్తృతంగా రోడ్లను నిర్మించారు. ఐటీ కార్యకలాపాలకు విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని కార్పొరేట్ కంపెనీలకు సంకేతాలు పంపించారు. దీంతో మనదేశంలో పేరుపొందిన కంపెనీలు శాఖలను ఏర్పాటు చేశాయి. 2019లో ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఐటీ కార్యకలాపాలు మందగించాయి.మళ్లీ ఇప్పుడు ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం రూపు రేఖలు మారిపోతున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా ఐటీ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇప్పటికాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పనిచేసే డేటా సెంటర్లు కూడా విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతున్నాయి. దీనికి తోడు క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో కూడా విశాఖపట్నం అగ్రగామిగా వెలుగొందడానికి అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో మౌలిక వసతులు పెరిగిపోవడం.. భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడంతో అక్కడ పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది..చంద్రబాబు విశాఖపట్నం గ్లోబల్ క్యాపిటల్ గా మార్చడానికి అడుగులు వేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ నగరంలో ఐటి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో ఐటీ ఆధారిత కార్యకలాపాలు సాగడానికి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. విశాఖపట్నం కి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి ఆ మధ్య జరిగిన ప్రపంచం పెట్టుబడిదారుల సదస్సులను ఉపయోగించుకున్నారు. ఈ క్రమంలోనే విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి అనుకూల పరిస్థితులు కల్పించారు. కేంద్రంలో ఎలాగూ సపోర్ట్ ఉంది కాబట్టి.. చంద్రబాబు గూగుల్ ప్రతినిధులతో మంతనాలు జరపడం ఈజీ అయిపోయింది.ఐటీ మంత్రిగా నారా లోకేష్ తెరమందు ప్రయత్నాలు మొత్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను సరళీకృతం చేశారు. ప్రపంచ పెట్టుబడిదారులకు గుమ్మంగా విశాఖపట్నం ఎందుకు ఉంటుందో పదేపదే వివరించే ప్రయత్నం చేశారు. దీనికి తోడు భూముల కేటాయింపు నుంచి మొదలుపెడితే అనుమతుల వరకు ప్రతి విషయంలోనూ ఆయన చొరవ తీసుకున్నారు. అందువల్లే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చింది. గూగుల్ సంస్థ రావడంతో.. రిలయన్స్.. అదాని.. మిట్టల్ వంటి సంస్థలు కూడా వచ్చేశాయి. ఇవన్నీ కూడా ఒక విశాఖపట్నం నగరంలోనే దాదాపు మూడు లక్షల కోట్లకు మించి పెట్టుబడులు పెడుతున్నాయి. దీనిని బట్టి విశాఖపట్నం నగరానికి భవిష్యత్తు కాలంలో ఏ స్థాయిలో డిమాండ్ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.. ఒక బిజినెస్ ఏర్పాటు కావాలంటే దానికి అనుకూల పరిస్థితులు ఉండాలి. ఆ పరిస్థితులను చంద్రబాబు కల్పించారు కాబట్టి.. విశాఖపట్నం గ్లోబల్ కాపిటల్ గా మారబోతోంది.

### మే చివరి వారంకానీ జూన్‌లో

# పంచాయితీ పోల్స్‌కు ఏర్పాట్లు




విజయవాడ, ఏప్రిల్ 30, ( వాయిస్ టుడే ) : ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13,100 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో పాలన మొత్తం ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్ళింది. ప్రభుత్వం ఈ వేసవిలోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ మళ్ళీ పట్టాలెక్కే సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో, క్షేత్రస్థాయిలో పాలన స్తంభించకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే, గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి సుదీర్ఘకాలం అధికారుల పాలనను కొనసాగించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ నిశ్చయంతో ఉన్నారు. వీలైనంత త్వరగా అంటే.. మే లేదా జూన్ నెలల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో, ప్రభుత్వ భవనాలు, ఉపాధ్యాయుల సేవలను ఎన్నికల విధులకు వినియోగించుకోవడం సులభతరం అవుతుంది. ఇదే తరుణంలో ఎన్నికలు నిర్వహిస్తే అటు విద్యా సంవత్సరంపై ప్రభావం ఉండదని, ఇటు వర్షాకాలం మొదలవ్వకముందే కొత్త పాలకవర్గాలు కొలువు తీరుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం దీనిపై ప్రాథమిక కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన , రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకంగా మారింది. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి భారీ విజయం తర్వాత వస్తున్న ఈ స్థానిక ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. జనసేన, బీజేపీలతో కలిసి రిజర్వేషన్ల కేటాయింపులో ఎక్కడా వివాదాలు రాకుండా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సాంకేతిక ప్రక్రియ మే నెలలో పూర్తి చేసి, జూన్ కల్లా పోలింగ్ నిర్వహించేలా కార్యాచరణ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ప్రతిపక్ష వైసీపీ కూడా ఈ ఎన్నికలపై గట్టి ఆశలే పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తమ క్యాడర్‌లో మళ్ళీ ఉత్సాహాన్ని నింపాలంటే స్థానిక సంస్థల ఎన్నికలే సరైన వేదిక అని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అయితే, అధికార పార్టీపై సానుకూలత ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్లడం ద్వారా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని టీడీపీ భావిస్తోంది. ఉపాధి హామీ నిధులు, గ్రామాలకు వచ్చే కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించాలంటే ఎన్నికైన పాలకవర్గాలే ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ నిబంధన కూడా దీనికి ప్రధాన కారణం. వేసవి సెలవుల లోపు నోటిఫికేషన్ విడుదల కాకపోతే, జూలైలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. అందుకే, సెక్షన్ 14 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి, వీలైనంత వేగంగా ఓటర్ల జాబితాల సవరణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

### ఇవాళ్టి నుంచి భారీగా

## రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ

మార్కెట్ ధరలను క్రమబద్ధీకరించడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనం ప్రవాహాన్ని అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. చాలా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ ధరలు ఆకాశంలో ఉండగా, రిజిస్ట్రేషన్ విలువలు మాత్రం తక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ గ్యాప్‌ను పూడ్చడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు వ్యూహంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయం వల్ల మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. పట్టణ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలు, ఓపెన్ ప్లాట్ల విలువలు గణనీయంగా పెరగనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల విలువలను కూడా భారీగా పెంచబోతున్నారు. కమర్షియల్ ప్రాపర్టీల రిజిస్ట్రేషన్ రేట్లు కూడా చుక్కలు చూపించనున్నాయి. కేవలం ఆస్తి విలువ పెరగడమే కాకుండా, ఆ పెరిగిన విలువపై చెల్లించే స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు అన్నీ కలిపి కొనుగోలుదారుడిపై భారాన్ని రెట్టింపు చేస్తాయి.తెలంగాణలో గతంలో 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మార్కెట్ విలువలను సవరించింది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న తొలి విలువల సవరణ ఇదే కావడం గమనార్హం. నిజానికి ఏడాది క్రితమే ఈ రేట్లు పెరగాల్సి ఉన్నప్పటికీ, అప్పట్లో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొన్న మందగమనం కారణంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇప్పుడు మార్కెట్ మళ్లీ పుంజుకోవడంతో ఈ నిర్ణయాన్ని అమలులోకి తెస్తోంది.మే మొదటి వారం నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయన్న సంకేతాలతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రద్దీగా మారే అవకాశం ఉంది. పెరిగే భారం నుంచి తప్పించుకునేందుకు చాలా మంది ఏప్రిల్ నెలాఖరు లోపే తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని భావిస్తున్నారు. స్లాట్ల బుకింగ్ కోసం జనం ఎగబడే అవకాశం ఉండటంతో రిజిస్ట్రేషన్ శాఖ కూడా అప్రమత్తమైంది.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

వెల్లడించారు. తెలంగాణలో. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 47.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్ లోనూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. మహబూబ్ నగర్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో నలభై నుంచి నలభై మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

## రాష్ట్ర సేన నుంచి రక్షణ సేనగా మార్పు

తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టుకునే ఉంటే అనుమతి వచ్చేది కాదేమో కానీ ఆమె తెలంగాణ రాష్ట్ర సేన అని తెలివిగా ఇంగ్లీష్‌లో టీఆర్ఎస్ అని వచ్చేలా పేరును డిజైన్ చేశారు.పార్టీకి ఈసీ గుర్తించడంపై ఆనందం వ్యక్తం చేసిన కవిత టీఆర్ఎస్ నాకు రాసి పెట్టిందేమో అని కామెంట్ చేశారు. "తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందని సమస్త తెలంగాణ సమాజానికి తెలియ చేయడానికి సంతోషిస్తున్నాము రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం నేను చేసిన కృషిని కొనసాగిస్తూ, ఇక ముందు కూడా తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో పని చేస్తానని తెలియజేస్తున్నాను. జనవరి 2026 లో జాతీయ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. అందులో మూడవ ప్రాధాన్యత గా మేము ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించడం కేవలం యాదృచ్ఛికం. ౧=హా నాకు రాసిపెట్టుండేమో" అని వెల్లడించారు. జనవరిలో పార్టీ కోసం కవిత దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగామ ప్రజాశక్తి పేరుతో పార్టీకి పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీకి విజప్తి చేశారు. అయితే మొన్నటి వరకు వీటిలో దేనికి కూడా ఆమోదం రాకపోయేసరికి మంచి ముహూర్తం ఉందని టీఆర్ఎస్ పేరుతో వస్తున్నట్టు ప్రకటించారు. కానీ ఇప్పుడు ఈసీ ఆమె ఇచ్చిన ఐదు ఆప్షన్స్‌లో తెలంగాణ సేనకు అంగీకారం తెలిపింది. ఆమె అనుకున్నట్టుగానే టీఆర్ఎస్ కలిసి రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## యాక్షన్ మోడ్‌లోకి కేటీఆర్

సూచించారు. అదేవిధంగా రాబోయే ఎన్నికలపైనా కేటీఆర్ ముందస్తుగానే సమీక్షలు నిర్వహించారు. ఏయే నియోజకవర్గాల్లో ఏమేరకు సానుకూలత ఉందన్న విషయాన్ని ఆరా తీశారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకువె ళ్లాలని ఆయన సూచించారు. ప్రజల మధ్య ఉండే నాయకులే గుర్తింపు ఉంటుందని తేల్చేశారు. తన సోదరి కవిత రాజకీయాలు.. ఆమె పెట్టుకున్న టీఆర్ ఎస్ పార్టీపైనా కేటీఆర్ నర్మగర్భంగా మాట్లాడారు. కొత్త పార్టీ అని పిలుస్తూ.. --కొత్త పార్టీలపై ఎవరూ స్పందించొద్దు. సమయం, సందర్భం చూసుకుని కేసీఆర్ సర్ స్పందిస్తారు. అప్పటి వరకు ఓపికగా ఉండండి. ఎన్ని పార్టీలు వచ్చినా.. కేసీఆర్ నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యల విషయంలో మీరు అప్రమత్తంగా ఉండండి- అని నాయకులకు తేల్చి చెప్పారు. త్వరలోనే జిల్లాలు, మండలాల వారీగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

## బీజేపీ టార్గెట్ తెలంగాణ

ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.ప్రధాని మోదీ నిర్వహించబోయే జనాగ్రహ సభ కేవలం ఒక సాధారణ బహిరంగ సభ మాత్రమే కాదు. కాంగ్రెస్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభం, బీఆర్ఎస్‌లో వినిపిస్తున్న అసమ్మతి స్వరాలను తమ వైపు తిప్పుకోవడానికి ఇదొక వేదిక కానుంది. తెలంగాణలో బీఆర్ఎస్‌కు అసలైన ప్రత్యామ్నాయం బీజేపీనే అనే బలమైన ముద్రను వేయడానికి మోదీ ఈ వేదికపై నుంచి కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది. ఈ సభ ద్వారా అటు అధికార పక్షాన్ని, ఇటు కాంగ్రెస్‌ను ఏకకాలంలో ఇరకాటంలోకి నెట్టాలన్నది కాషాయ వ్యూహం. తెలంగాణ బీజేపీ నేతలు సైతం ఈ పర్యటనపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మోదీ రాకతో రాష్ట్రవ్యాప్తంగా భారీ చేరికలకు ప్లాన్ చేస్తున్నారు. ఇతర పార్టీల్లోని అసంతృప్త నేతలకు బీజేపీలో చేరడానికి మోదీ సభ ఒక ముహూర్తం గా మారుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బెంగాల్ ఫలితాలు అనుకూలంగా వస్తే, తెలంగాణలో బీజేపీ నేతల దూకుడుకు అడ్డుకట్ట వేయడం ఎవరికీ సాధ్యం కాదన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. బీజేపీ తన రెండో గేరును మార్చి వేగంగా ముందుకు దూసుకెళ్లడానికి సిద్ధమైంది. ఐదు రాష్ట్రాల ఫలితాలు ఇచ్చే బూస్ట్‌తో మోదీ జనాగ్రహం ద్వారా తెలంగాణలో రాజకీయ సమీకరణాలను మార్చేయాలని చూస్తోంది. ఈ పర్యటన తర్వాత రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్లుగా మారుతాయా లేదా అన్నది మే మొదటి వారంలో తేలనుంది.

## విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

### నాణ్యమైన విత్తనాలనే రైతులకు అందుబాటులో ఉంచాలి

### నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్ : రోజు సచివాలయంలో వ్యవసాయశాఖ, సీడ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ మరియు విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. వానాకాలం (ఖరీఫ్) 2026 సాగు సన్నాహకంలో భాగంగా, వచ్చే ఖరీఫ్ సీజన్కు సంబంధించి విత్తనాల లభ్యతను కంపెనీల వారీగా, పంటల వారీగా సమీక్షించారు. రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలే అందుబాటులో ఉంచాలని మంత్రి స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వానాకాలం 2026లో రాష్ట్రంలో సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశముండగా, దానికి 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా. ప్రస్తుతం రాష్ట్రంలో 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరానికి దాదాపు రెండింతలు నిల్వలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పత్తి సాగు విషయంలో సుమారు 52 లక్షల ఎకరాల లక్ష్యంతో, రైతులకు అవసరమైన 104 లక్షల ప్యాకెట్లకు బదులుగా 212.11 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. గత సంవత్సరం వినియోగంతో పోలిస్తే ఈ సంవత్సరం అధిక నిల్వలు రైతులకు విశ్వాసాన్ని కలిగిస్తాయని మంత్రి పేర్కొన్నారు. హైబ్రిడ్ విత్తనాల లభ్యతపై ప్రత్యేకంగా చర్చిస్తూ, రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న విత్తనాలను ప్రాధాన్యంగా సరఫరా చేయాలని మంత్రి సూచించారు. విత్తనాల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. నాణ్యత లేని విత్తనాల తయారీ, విక్రయాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గతంలో సబ్స్టాండర్డ్ విత్తనాలపై కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రతి నెలాఖరులో కంపెనీలు తమ స్టాక్ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని, సెల్ఫ్ సర్టిఫైడ్ విత్తనాల వల్ల నష్టం కలిగితే కంపెనీలే భరించాలని సూచించారు. విత్తనాల సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు లైసెన్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని మంత్రి పేర్కొన్నారు. GOT ఫెయిల్ అయిన పత్తి విత్తనాలను పూర్తిగా వినియోగానికి అనర్హంగా ప్రకటించి రైతులకు చేరకుండా నిరోధించాలని ఆదేశించారు. అదేవిధంగా కో మార్కెటింగ్ విధానంలో ఏ కంపెనీ విత్తనాన్ని, ఏ కంపెనీ, ఏ పేరుతో అమ్ముతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని, సీడ్ యాక్ట్ లో ఉన్న కొన్ని లోపాలను కంపెనీలు అవకాశంగా మార్చుకొని రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలను తమ ప్రభుత్వం ఉపేక్షించదని తెలిపారు. అవసరమైతే కో మార్కెటింగ్ పూర్తి రద్దుచేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం




బోడుప్పల్/సికింద్రాబాద్, ఏప్రిల్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): ఎన్ఐఎన్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర శివాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది.శ్రీ త్రిదండి బృందావన రామానుజ జీయర్ స్వామి శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటెల రాజేందర్,ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, మంద సంజీవరెడ్డి,ఇతర ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ కమిటీ అధ్యక్షులు ఏనుగు ప్రతాప్ రెడ్డి, చైర్మన్ దీటి గణేష్, కాలనీ ప్రెసిడెంట్ మేకల శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ కొండ ఐలయ్య యాదవ్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది. కాలనీ వాసులు రెడ్డి గారి రమేష్ రెడ్డి, మల్లేష్ యాదవ్, పప్పు సత్యనారాయణ, రచ్చ బిక్షపతి, మర్రి విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాలనీ భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



## ముగిసిన టెక్నోస్మానియా 2k26

సికింద్రాబాద్, ఏప్రిల్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): ఓయు టెక్నాలజీ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ గురువారం ముగిసింది. ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు నిర్వహించే ఈ కార్యక్రమం విద్యార్థుల లోని సృజనాత్మక ను వెలికి తీయడాని ఉపయోగ పడుతాయని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి అన్నారు. టెక్నోస్మానియా కార్యక్రమాన్ని అభినందించారు.డీన్ డెవలప్మెంట్ అండ్ యూ.జి.సి. ప్రొఫెసర్ బి.లావణ్య, కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్. శ్రీను నాయక్ లు మాట్లాడుతూ ఓయు టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల లో నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. రమేష్ కుమార్ మాట్లాడుతు టెక్నోస్మానియా కార్యక్రమం మూడు రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలతో అద్భుతంగా నిర్వహించారనీ విద్యార్థులను మరియు కన్వీనర్ ను అభినందించారు. వివిధ కార్యక్రమాల లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం డాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అంబరాన్ని అంటేలా టెక్నోస్మానియా ముగిసింది. ఈ కార్యక్రమంలో డీన్ ఫాకల్టీ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ చింత సాయిలు, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆచార్య బి.రాజం, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ ప్రొఫెసర్ జె.హయవదన, ఫాకల్టీ కోఆర్డినేటర్ లు డా.బి.పరమేశ్వర్లు, డా. ఎస్. ఐలయ్య, డా.వి.భాస్కర్, డా.కె.శ్రీనివాస్, డా.పి.అరుణా దేవి, డా.ఎ.పరశురామ్ , డా.టి.జ్యోతి, డా.పి.సునిత, డా.ఎ.కవిత, డా.అర్జున్, డా.ధీరజ్, డా.రేణు, డా.ఎం.రమేష్, డా.సమీ, డా.ఎ.విజయకాంత్, డా.టి.వెంకటేశ్వర్లు, డా.సర్దార్ జస్పాల్ సింగ్, డా.విజయ లక్ష్మి, డా.అజిత్ , డా.అభిలాష్,స్టూడెంట్ కోఆర్డినేటర్స్ , సి.హెచ్.సాయి కుమార్, ఎస్.లావణ్య, అజిత్, ఎం.సాయి కుమార్, ప్రదీప్, వినూత్న, హర్షిత, ఇతర స్టూడెంట్ కోఆర్డినేటర్ లు , కలశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## విహెచ్‌కు అభినందన సత్కారం

కాచిగూడ, ఏప్రిల్ 30 (వాయిస్ టుడే) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు బీసీ సంక్షేమ శాఖకు మంత్రి హోదాతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన సందర్భంగా జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, బర్కత్ పుర మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు గురువారం ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కొత్త అక్రెడిటేషన్లు వచ్చే వరకు... పాత కార్డుల గడువు పొడిగించాలి

### టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



హైదరాబాద్, ఏప్రిల్ 30 (వాయిస్ టుడే) : రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల పాత అక్రెడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తున్నందున కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీ అయ్యేంత వరకు పాత కార్డులు చెల్లుబాటు అయ్యే విధంగా కనీసం నెల రోజులకు పొడిగించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాత అక్రెడిటెషన్ కార్డుల చెల్లుబాటు గడువైతే ముగిసింది కానీ కొత్త కార్డులు మాత్రం ఇంతవరకు జారీ చేయలేదని, ఆరంభ శూరత్వంగా గురువారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొద్ది మంది జర్నలిస్టులకు మాత్రమే అందజేశారని, అంతే తప్ప రాష్ట్ర స్థాయిలో గానీ, జిల్లా, మండల స్థాయిలో గానీ ఇంకెవరికీ కార్డులివ్వలేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు కూడా ఇంతవరకు కార్డులివ్వలేదని, ఈ ప్రక్రియలో ఏర్పడిన గందరగోళం కారణంగా చాలా మంది జర్నలిస్టులు నేటికీ దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. కొత్త కార్డులు రాకముందే పాత కార్డుల చెల్లుబాటును నిలిపివేయడం సరైంది కాదని, దీనివల్ల జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతాయని,ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం, ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మే ఒకటి నుంచి 10వ తేదీ మధ్య అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలంటూ ఐఅండ్ పీఆర్ కొత్త కమీషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని, అయితే కొత్త కార్డులు వచ్చేంత వరకు పాత కార్డులు చెల్లుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని మామిడి సోమయ్య కోరారు.




## ఉత్తమ ఫలితాలు సాధించిన నాగారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అభినందనలు

నాగారం, ఏప్రిల్ 30:-(వాయిస్ టుడే): పది ఫలితాల్లో కీసర మండలంలోనే నాగారం ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో ప్రణీత్ 569, రెండవ స్థానంలో నిహారిక 559 మార్కులు సాధించి తమ ఘనతను చాటుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థుల సన్మాన కార్యక్రమం పాఠశాల ఆవరణ లో గురువారం ప్రధానోపాధ్యాయులు పిసి రాములు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా నాగారం ఊరులో ఉన్నాం కానీ మండలంలో అత్యధిక మార్కులు సాధించినది మాత్రం గత సంవత్సరం వచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యయులు పిసి రాములు, ఉపాధ్యాయుల బృందం కృషి తోనే సాధ్యం అయ్యిందని కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మండలం లోనే అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలని, తమ పాఠశాల ఉపాధ్యాయులు కష్టపడుతున్నారని, కానీ ఉపాధ్యాయుల కొరత మూలంగా చంద్రా రెడ్డి ఔదార్యం చూపించి, ఇద్దరు విద్యా వాలంటీర్ లకు 10 వేల చొప్పున చెల్లిస్తూన్నారని అన్నారు. అది అలాగే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకుసన్మానం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు అరవింద్ కుమార్, మాలోత్ నాయక్, వందన, రఘు, గాయత్రీ, సుప్రజ, సంజయ్ రాణీలు, మాజీ కౌన్సిలర్ బి శ్రీనివాస్ గౌడ్, గ్రామ పెద్దలు నక్కా కిషోర్, రాజు గౌడ్, కిషోర్ చారి, రవీందర్ రెడ్డి, రాకేష్ గౌడ్, రవిబాబు లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఐసీఎస్ఈ, ఐఎస్సీ ఫలితాల్లో శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ హైస్కూల్ విద్యార్థుల ప్రభంజనం



హైద్రాబాద్ (వాయిస్ టుడే):ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఐసీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో, ఐఎస్సీ ఇంటర్ ఫలితాల్లో విద్యానగర్ లోని శ్రీ అరబిందో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులందరూ వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో పదోతరగతి సైన్స్ స్ట్రీమ్లో కొండి. బ్రిందా రోహన్ 98.2 శాతం, హర్షిక 95.6 శాతం, కామర్స్ స్ట్రీమ్లో బొర్ర. నిత్యాశీగిరెడ్డి 95 శాతం, వీర ఎన్. బల్దేవ్ 94 శాతం మార్కులతో స్కూల్ టాపర్స్ గా నిలిచారు. గత 22 సంవత్సరాలుగా తమ స్కూల్ వంద శాతం ఫలితాలను సాధిస్తుందని స్కూల్ యాజమాన్యం పేర్కొంది. ఐఎస్సీ ఇంటర్ ఫలితాల్లో సైన్స్ స్ట్రీమ్లో శ్రీవైష్ణవి 96.4 శాతం, ఎం. కునాల్ కుమార్ 92.2 శాతం, కామర్స్ స్ట్రీమ్ లో లలిత శృతి 94.2 శాతం, గౌరవ్ లోయ 89.8 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. గత 16 సంవత్సరాల నుంచి ఇంటర్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చలమైరెడ్డి, హెడ్ మిస్ట్రేస్ జయశ్రీ పేర్కొన్నారు. పిల్లలను విద్యతో పాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు తాము నిరంతరం క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు.

## అంగన్వాడీల సంక్షేమానికి పెద్దపీట

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..

### అంగన్వాడి ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్ల పంపిణీ




పటాన్చెరు : పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్చెరు లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 153 మంది. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అంగన్వాడి కేంద్రాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ప్రతి అంగన్వాడి ఉపాధ్యాయురాలికి మొబైల్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జయరాం నాయక్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పదవ తరగతి ఫలితాలలో నారాయణ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

హైద్రాబాద్ (వాయిస్ టుడే):రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 2025-26 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో నారాయణ వెస్ట్ మారేడ్‌పల్లి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి 100% ఉత్తీర్ణతతో విజయ దుందుభి మ్రోగించారు.

ప్రథమ స్థానంలో: 580/600 - సాయి గౌతమ్ పట్నాయక్

ద్వితీయ స్థానంలో: 579/600 - సంజన

తృతీయ స్థానంలో: 574/600 - మోహిత్ నిలిచారు.

గురువారం నిర్వహించిన ఈ విజయోత్సవ వేడుకలలో ఏజీఎం పురుషోత్తమ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నాగారం డివిషన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

నాగారం, ఏప్రిల్ 30:-(వాయిస్ టుడే) : నాగారం డివిజన్లో ఆన్ ప్రోగ్రెస్ లో ఉన్న రూపాయలు 25 కోట్ల పెండింగ్ వర్క్స్ త్వరగా పూర్తి చేయాలని ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఘటకేసర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ వాణిరెడ్డికి వినతిపత్రం అందజేసారు. గురువారం ఘటకేసర్ మునిసిపల్ సర్కిల్ కార్యాలయంలో ఆమెను కలిసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, సుమిత్ర సురేష్, మాజీ ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, నాగారం 16వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజేటి వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## SSC ఫలితాల్లో సత్తా చాటిన వైష్ణవి విద్యార్థులు మన విజయం ఘన విజయం




రామంతాపూర్ లోని వైష్ణవి ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు 2026 సంవత్సరానికి సంబంధించిన రాజ పబ్లిక్ పరీక్షల్లో అద్భుత విజయాన్ని సాధించారు. మనోజ్ చారి 600 మార్కులకు 568 మార్కులను సాధించాడు .ఈ మండి విర్వారులు 1 500 మార్కులకు పైగా సాధించారు. ఈ అద్భుత ఫలితాలకు కారణం విద్యార్థుల కష్టపడ చదివే స్వభావం, ఉపాధ్యాయుల నిబద్ధతతో కూడిన బోధవ, అలాగే తల్లిదండ్రుల సహకారం చాలా ఉంది . ఈ సందర్భంగా వైష్ణవి ఒలంపియాడ్ స్కూల్ చైర్మెన్ కబీర్ నిర్యార్థులందరినీ హృదహ పూర్వకంగా అభినంధిస్తూ, భవిష్య త్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## రసాయన శాస్త్రంలో వై.బాలాజీరావుకు పీహెచ్.డీ.

పటాన్ చెరు : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వై. బాలాజీరావు (ఎన్.ఎఫ్.సీ. హైదరాబాదు పూర్వ జనరల్ మేనేజర్) డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'భారత అణు ఇంధన సబ్-అసెంబ్లీ తయారీ ప్రక్రియలో ఉపయోగించే యురేనియం, జిర్కోనియం, జిర్కోనియం ఆధారిత మిశ్రమ లోహాలు, ఉక్కుల రసాయన లక్షణాల నిర్ధారణ కోసం కొత్త విశ్లేషణాత్మక అనువర్తనాల అభివృద్ధికి ఒక నూతన, క్రమబద్ధమైన అధ్యయనం' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ.వీ. నాగేంద్ర కుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

విశ్లేషణాత్మక కచ్చితత్వం, సామర్థ్యం, సుస్థిరతను మెరుగుపరచడానికి ఈ అధ్యయనం అయాన్ క్రోమాటోగ్రఫీ (ఐసీ), ఇండక్టివ్లీ కపుల్డ్ ఫ్లాస్మా-అటామిక్ ఎమిషన్ స్పెక్ట్రోస్కోపీ (ICP-AES) గ్లో డిశ్చార్జ్ ఆప్టికల్ ఎమిషన్ స్పెక్ట్రోస్కోపీ (GD-OES) వంటి అధునాతన పద్ధతులను సమన్వయం చేస్తుందని తెలియజేశారు. విశ్లేషణాత్మక వ్యర్థాలను, నిర్వహణ ఖర్చులను తగ్గిస్తూ, వేగవంతమైన, అధిక-ఉత్పత్తి విశ్లేషణను సాధ్యంచేసే అనేక వినూత్న పద్ధతులను డాక్టర్ బాలాజీరావు అభివృద్ధి చేశారన్నారు. ఆయన చేసిన కృషి, ఘన నమూనాల విశ్లేషణ, రామన్ స్పెక్ట్రోస్కోపీని ఉపయోగించి ఆన్ లైన్ ప్రక్రియ పర్యవేక్షణ, జూ-ూూూ యొక్క విస్తరించిన అనువర్తనాలతో సహా, భవిష్యత్ దృష్టితో కూడిన విధానాలను కూడా ప్రతిపాదిస్తుందని తెలిపారు. ఇవి అణు



పదార్థాలలో నాణ్యత హామీని మెరుగుపరచడానికి దోహదపడతాయన్నారు. ఈ అధ్యయనం, అణు ఇంధన సంస్థ (ఎన్.ఎఫ్.సీ) వద్ద ఉన్న కీలకమైన విశ్లేషణాత్మక సవాళ్లను పరిష్కరిస్తుందని, భారతదేశపు అణుశక్తి, హరిత ఇంధన కార్యక్రమాలకు మద్దతు ఇస్తుందని తెలియజేశారు. డాక్టర్ బాలాజీరావు సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
శుక్రవారం 1 మే 2026

# ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో "సమర్థ" శిక్షణా శిబిరం




## బోడుప్పల్ నారాయణ స్కూల్‌లో పదవతరగతి పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత

మేడిపల్లి,ఏప్రిల్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): బోడుప్పల్ నారాయణ స్కూల్ లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యుత్తమ మార్కులు 595 సాధించి నారాయణ గూడ నిలవగా.బోడుప్పల్ బ్రాంచ్ లో 591 మార్కులు సాధించి బి.చరణ్ మొదటి స్థానంలో నిలవగా ,590 మార్కులతో అనన్య రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం బాల పరమేశ్వర్ తీర్ణత సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు, అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మా లఈ ఫలితాలు కు విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులు చేసిన కృషి కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డి హెడ్ మనోహర్, హెచ్ ఎస్ సి ఆజాద్, ప్రిన్సిపల్ ప్రవీణ మహేశ్వరి, అకాడమిక్ ఇంచార్జ్ లక్ష్మీకాంత్, పదవ తరగతి ఇంచార్జ్ శ్రీలత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్ బి సీ ఎస్ ఏ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రిశ్రిత్



హైదరాబాద్ :ఏప్రిల్ 30 ; ( వాయిస్ టూ డే) జాతీయ బీసీ స్టూడెంట్ అసోసియేషన్(ఎన్ బి సీ ఎస్ ఏ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వనస్థలిపురానికి చెందిన బాణాల రిశ్రిత్ నియమి తులయ్యారు. ఈ మేరకు రిశ్రిత్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ సమక్షంలో జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా రిశ్రిత్ నియామకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బాణాల రిశ్రిత్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేసి వాటి పరిష్కారంలో తనవంతు పాత్రగా కృషిచేస్తానని తెలిపారు.

## కార్మిక లోకానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మే డే శుభాకాంక్షలు



హైదరాబాద్, (వాయిస్ టుడే): ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కార్మికులు, శ్రామికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తమ చెమటను దారబోసి దేశ సంపదను సృష్టిస్తున్న శ్రామికుల కృషి, త్యాగాలు అమూల్యమైనవని ఆయన మే డే సందేశంలో పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి కార్మిక వర్గం కీలక శక్తిగా నిలుస్తోందని ఆయన అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన పదేళ్ల పాలనలో కార్మిక సంక్షేమానికి విశేష ప్రాధాన్యత ఇచ్చారని రవిచంద్ర కొనియాడారు. సింగరేణి, ఆర్టీసీ, భవన నిర్మాణ రంగాల్లో పనిచేసే కార్మికులు, అసంఘటిత రంగ శ్రామికులు, ఆటో డ్రైవర్లు, దినసరి కూలీలు, బీడీ కార్మికుల కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారని వివరించారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల కార్మికులు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



## మున్నూరు కాపులు రాజ్యాధికారం సాధించాలి

### మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

సూర్యాపేట, ఏప్రిల్ 30(వాయిస్ టుడే ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల్లోని మున్నూరు కాపులు రాజ్యాధికారం సాధించాలని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే, జనసేన పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వర్లు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా నాగేశ్వరరావు అన్నారు. గురువారం మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శ్రీకృష్ణదేవరాయ మున్నూరు కాపు సంఘం నిత్య అన్నదాన సత్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన నాలుగు ఏసీ గదులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఐక్యంగా ఉంటే తెలుగు రాష్ట్రాల్లో రాజ్యాధికారం సాధించవచ్చునని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో మున్నూరు కాపులు ఎంతో బలంగా ఉన్నారని గుర్తు చేశారు. సమాజంలోని ఇతర సామాజిక వర్గాలను కలుపుకొని ముందుకు సాగాలన్నారు. మట్టపల్లి లో లక్షలాదిరూపాయలతో 18 గదుల నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు.

మట్టపల్లి సత్ర అభివృద్ధికి కృష్ణాజిల్లా జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాస్ నాయుడు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మట్టపల్లి సత్రంలో కళ్యాణ మండప నిర్మాణానికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరం అన్నారు. ప్రస్తుతం నాలుగు ఏసీ రూములు ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన మరో 10 గదులు కూడా ఏసీ రూములుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లోనే మున్నూరు కాపుల ఆర్థిక సహాయ సహకారాలతో సత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల్లోని కృష్ణ, గుంటూరు, హైదరాబాదు, సూర్యాపేట, ఉమ్మడి నల్లగొండ జిల్లాలకు చెందిన మున్నూరు కాపులు సత్రంలో ప్రధాన భాగస్వామ్య కావడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉదయభాను నూతనంగా ఏర్పాటుచేసిన ఏసి గదుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్ర కమిటీ అధ్యక్షులు తోట వెంకయ్య నాయుడు సర్పంచ్ రామిశెట్టి విజయశాంతి అప్పారావు, సత్ర కమిటీ కోశాధికారి సభ్యులు పసుపులేటి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు, నాగ సైదయ్య, వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ పాడి కాశయ్య, రామిశెట్టి విజయ మాధవి, బజ్జూరి విజయ, దవనం పద్మ, పొట్ట జగన్మోహన్రావు, కొప్పుల బుల్లయ్య, కూరాకుల సాంబయ్య, రంగయ్య, భీమ్శెట్టి తిరుపతి వెంకయ్య పాల్గొన్నారు.

---

### సేవాదళ్ బలోపేతానికి మంత్రి సీతక్క పిలుపు

### సిద్ధాంతపరమైన శిక్షణతో గ్రామ స్థాయి వరకు కాంగ్రెస్ బలోపేతం

### యువత సేవాదళ్‌లో చేరాలని సూచన




హైదరాబాద్ ( వాయిస్ టుడే): ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సమర్థ" శిక్షణా శిబిరాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల కేబినెట్ మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సేవాదళ్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, 33 జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు మరియు 119 నియోజకవర్గాల అధ్యక్షులు పాల్గొంటున్నట్లు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు తీసుకెళ్లడంలో సేవాదళ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సేవాదళ్‌ను ప్రతి పోలింగ్ బూత్ స్థాయికి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో పరిస్థితులు మారినా, సిద్ధాంతపరమైన శిక్షణ పొందిన సేవాదళ్ నాయకులు ప్రజాస్వామ్య విలువల కోసం కట్టుబడి ఉంటారని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సేవాదళ్ బలోపేతం తప్పనిసరి అని స్పష్టం చేసిన మంత్రి, యువత పెద్ద సంఖ్యలో సేవాదళ్‌లో చేరాలని సూచించారు. సేవా భావన, క్రమశిక్షణ, త్యాగం వంటి విలువలు నేర్చుకున్న తర్వాతే రాజకీయాల్లోకి రావడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అవసరమని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజల హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, మహిళల భద్రత, రైతుల సమస్యలు వంటి అంశాలపై సేవాదళ్ కార్యకర్తలు పనిచేయాలని ఆమె సూచించారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మాట్లాడుతూ, "సమర్థ" శిక్షణా శిబిరం ద్వారా సేవాదళ్ నాయకులను సిద్ధాంతపరంగా, సంస్థాగతంగా బలోపేతం చేయడం లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ సిద్ధాంతం, రాజ్యాంగ విలువలు, బూత్ స్థాయి సంస్థాగత నిర్మాణం, సోషల్ మీడియా అవగాహన వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల కమిటీ సభ్యులు, సేవాదళ్ వాలంటీర్లు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

---



## ఇస్నాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మీడియా సమావేశం

పటాన్ చెరు : పటాన్ చెరు నియోజకవర్గ ఇస్నాపూర్ మున్సిపాలిటీలో గురువారం కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న అనేక వ్యవహారాలపై కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మున్సిపల్ అధికారులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ప్రజలకు ఉచితంగా అందించాల్సిన మంచినీటిని మున్సిపల్ అధికారులు అపార్ట్మెంట్లకు విక్రయిస్తున్నారని వారు విమర్శించారు.

మున్సిపల్ బడ్జెట్, ఇంటి పన్నుల వసూళ్లపై సరైన సమాచారం ఇవ్వడం లేదని, పారదర్శకత లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అలాగే డంప్‌యార్డ్ వ్యవహారంలో పెద్ద ఎత్తున అనుమానాలు ఉన్నాయని, చెత్తను ఎవరు తరలించారు, ఎంత బిల్లు మంజూరు చేశారు అనే వివరాలు వెల్లడించడం లేదని పేర్కొన్నారు. ఒకే కాంట్రాక్టర్‌కు 11 కాంట్రాక్టులు ఏ ప్రాతిపదికన ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ కాంట్రాక్టర్‌తో లోపాయకారి ఒప్పందాలు జరిగాయా అంటూ ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులపై కూడా వారు ఆరోపణలు చేశారు. ఇస్నాపూర్ మున్సిపల్ నిబంధనల ప్రకారం పన్నులు వసూలు చేయాలని, సిఎస్ఆర్ నిధులను మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. కొంతమంది పరిశ్రమలకు అనుకూలంగా అవినీతి జరుగుతోందని మున్సిపల్ అధికారులపై ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇతర అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు, త్వరలోనే జిల్లా కలెక్టర్, మంత్రి, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ మీడియా సమావేశ కార్యక్రమంలో కౌన్సిలర్లు నారాయణ దాసు, సంపత్, రాఘవేందర్, వెంకటేష్ నాయక్, వర్ధన్ గౌడ్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహ రెడ్డి, గోపాల్, రవి, మణికంఠ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 600లో 573 మార్కులతో ఉదయశ్రీ అద్భుత విజయం



నల్గొండ, మే 1: వాయిస్ టుడే : బుధవారం రోజు వెల్లడించిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఐబిసి ఛానల్ సీనియర్ జర్నలిస్టు తూడి జనార్ధన్ కుమార్తె తూడి ఉదయశ్రీ ప్రతిభ కనబరిచింది. 600 మార్కులకు గాను 573 మార్కులు సాధించి విజయకేతనం ఎగరవేసింది. నల్గొండ పట్టణంలోని రాన్తీవవ పాఠశాలలో విద్యనభ్యసించిన ఉదయశ్రీ కృషి, పట్టుదలతో చదివి అత్యుత్తమ మార్కులు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ హనుమంత రెడ్డి, డైరెక్టర్ మంగారెడ్డి, ప్రిన్సిపల్ సునీల్ రెడ్డి ఆమెను అభినందించారు.

గ్లోబల్ మున్నూరు కాపు ఫౌండర్ మెంబర్, సంగాని వెంచర్స్ అధినేత సంగాని రజనీకాంత్, తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ కూడా ఉదయశ్రీ విజయాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తూడి జనార్ధన్, నీరజ మరియు తమ్ముడు నివేదన్ పటేల్ స్వీట్లు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## గాంధీభవన్‌లో స్టేట్ యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్

### జీహెచ్ఎంసీ ఎన్నికలపై కీలక చర్చలు

### స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ, సూర్యాపేట జిల్లా ఇంచార్జ్ జిట్టా రమ్యకృష్ణ సునీల్



కూకట్‌పల్లి, ఏప్రిల్ 30(వాయిస్ టుడే): గాంధీభవన్‌లో ఈరోజు జరిగిన స్టేట్ యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ మరియు సూర్యాపేట జిల్లా ఇంచార్జ్ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సమావేశం స్టేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివశరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్‌లు భవ్య మరియు రోషిని హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు మరియు కార్పొరేషన్ నామినేటెడ్ పోస్టుల్లో యూత్ కాంగ్రెస్ సభ్యులకు అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో స్టేట్ యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.



## సత్తా చాటిన నారాయణ విద్యార్థులు

నాచారం (వాయిస్ టుడే): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తార్నాక నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 10వ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి సత్తాచాటారు. వంద శాతం ఫలితాలతో పాటు 600గాను 590 మార్కులను శాన్వీరెడ్డి సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. జోన్ లో అధిక ఫలితాలను సాధించడంతో పాఠశాలలో విజయోత్సవాలు నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను జిఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లోనూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పర్వీన్, ఆర్ ఎండ్ డి హెడ్ మనోహర్, అజాద్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది

### మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

### వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



హనుమకొండ,వాయిస్ టుడే: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని..రాబోయే గ్రేటర్ వరంగల్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరేలా ప్రతీ గులాబీ కార్యకర్త కృషి చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండలోని క్యాంప్ కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని అరూరి రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు బిఆర్ఎస్ పార్టీ దేనని..అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలు,420 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించి గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలను కోరారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధిక రెడ్డి,మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జాప్యాన్ని ఉపేక్షించం, ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి

## అధికారులకు మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



కరీంనగర్, ఏప్రిల్ 30(వాయిస్ టుడే): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం కింద చేపట్టే గృహ నిర్మాణాలతోపాటు'భూ భారతి' సమస్యల పరిష్కరించేందుకు రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక సమీక్షలకు శ్రీకారం చుట్టారు.అందులో భాగంగా రాష్ట్ర రాజధానిలో హిమయత్ నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయించాలని,ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలేవైనా ఉంటే సత్వరం పరిష్కరించాలన్నారు. అలాగే భూములకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారాలకు పాటుపడాలన్నారు. ప్రజాప్రతినిధుల వద్దకు లేదా అధికారుల వద్దకు వచ్చే ఈ శాఖలకు సంబంధించిన సమస్యలు సత్వరం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.ఇక నుంచి సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని ఉపేక్షించబోమని పొంగులేటి స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పథకాలతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,గడ్డం వివేక్ వెంకటస్వామి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,ఎమ్మెల్సీ ఎల్.రమణ, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్,హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి,ఎమ్మెల్యేలు,ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.




## పదవతరగతి పరీక్షల్లో ప్రతిబ కనబర్చిన విద్యార్ధులను అభినందించిన ప్రధానోపాధ్యాయులు

### నగదు పారితోషికం అందజేత

బోయినపల్లి ఏప్రిల్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి) : బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో బోయినపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల లో వందకు 100% శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో 549 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన మెరుపుల వెన్నెల, 544 మార్కులతో రెండవ స్థానం లో నిలిచిన బొడ్డు శివకార్తిక్ ,542 మార్కులతో మూడవ స్థానం లో నిలిచిన రాజ్ కుమార్ లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమయ్యతో పాటు ఉపాధ్యాయులు పూల బొకేలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం మొదటి ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగతు పారితోషకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల లోనే తోలించి మంచి భవిష్యత్తుకు పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో మహిళా సాధికారతకై 'తెలంగాణ శక్తి అభియాన్' ఉద్యమం

### కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ పిలుపు




కరీంనగర్,ఏప్రిల్ 30(వాయిస్ టుడే): రాజకీయ రంగంలో మహిళలకు సముచిత స్థానం కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'తెలంగాణ శక్తి అభియాన్' కార్యక్రమాన్ని ఉధృతం చేస్తున్నట్లు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మహిళల భాగస్వామ్యం లేని ప్రజాస్వామ్యం అసంపూర్ణమని,అందుకే రాజకీయాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ సాధించడమే 'శక్తి అభియాన్' ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారుమహిళలను కేవలం ఓటర్లుగానే కాకుండా, నిర్ణయాధికారం కలిగిన నాయకులుగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.కరీంనగర్ కార్పొరేషన్ లోని చైతన్యవంతులైన మహిళా సోదరీమణులు,యువతులు ఈ ఉద్యమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆయన కోరారు.రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న వారు,సామాజిక మార్పు కోసం పనిచేయాలనుకునే మహిళలు కింది సమన్వయకర్తలను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కృష్ణవేణి (తెలంగాణ శక్తి అభియాన్ కో-ఆర్డినేటర్)ఫోన్ 83677 37373, సి.ఎస్.శివలాల్ నేతికర్ ఫోన్ 9966482554,జిల్లాలోని ప్రతి డివిజన్,ప్రతి బస్తీ నుంచి మహిళలు ఈ ఉద్యమంలో చేరి,తమ గొంతుకను వినిపించాలని, రాబోయే రోజుల్లో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేయడమే తమ ధ్యేయమని అంజన్ కుమార్ పిలుపునిచ్చారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

తిమ్మాపూర్, ఏప్రిల్ 30(వాయిస్ టుడే): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వంగర కనకలక్ష్మీ లబ్ధిదారుకు చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. బిల్లులవిషయంలో ఆందోళన చెందవద్దన్నారు.దశల వారీ బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్హోత్ర, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణి,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గోదారి తిరుపతి,మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి,పార్టీ నాయకులు నోముల అనిల్ కుమార్,గోదారి రాజమల్లు,ఇనుకొండ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



## రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగనియ్యం

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్, ఏప్రిల్ 30(వాయిస్ టుడే): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతును అన్నివిధాలా ఆదుకుంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నరేందర్ రెడ్డి రైతులతో ముచ్చటించారు.రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గత ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా రుణమాఫీ,రైతు భరోసా,సన్నాలకు బోనస్ ఇలా అనేక రకాలుగా రైతులను ఆదుకోవడం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిఈవో రమేష్, కార్పోరేటర్లు గాదె రూప శ్రీనివాస్, మేకల వెంకటేష్,నాయకులు కాంరెడ్డి రాంరెడ్డి,బీరం ఆంజనేయులు,కపిల్ మాధవ్,శ్రీధర్ రెడ్డి,రాజి రెడ్డి, వెంకటేష్,సాయిని తిరుపతి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఐదు రాష్ట్రాలలో బీజేపీకి అనుకూల ఫలితాలు

**కాంగ్రెస్ ఫెయిల్యూర్ గవర్నమెంట్**

**బిఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ**

**తెలంగాణలో డబల్ ఇంజన్ సర్కార్ లక్ష్యంగా బీజేపీ ముందుకు**

**మే 10న మోదీ సభ ద్వారా తెలంగాణకు దిశా నిర్దేశం**

**రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్**




కరీంనగర్, ఏప్రిల్ 30(వాయిస్ టుడే):ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ,క్షేత్రస్థాయిలో బీజేపీకి ఉన్న రిపోర్టు,అంచనాలకు అనుగుణంగా గణనీయ విజయాలు సాధిస్తుందని, అంచనాలకు మించిన ఫలితాలు వస్తాయని రాజ్యసభ సభ్యుడు,బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు,ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.కరీంనగర్లోని గణేష్ నగర్ బైపాస్ రోడ్డులో గల అదితి హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలికేలా ఈ నెల 10న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్నారని, ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈనెల భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్,ఇండియా కూటమి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసేలా ఈనెల 10న,జనాగ్రహ సభను నిర్వహించడానికి బిజెపి తెలంగాణ పార్టీ సన్నాహాలు చేస్తుందని,ప్రధాని మోదీ హాజరయ్యే ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతారని,ఇది తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే సభగా నిలుస్తుందన్నారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఆయన ఘాటుగా విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రాన్ని ఏ లా నడపాలో అర్థం కాని స్థితిలో పాలన కొనసాగిస్తుందన్నారు.ఇక బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు విఆర్ఎస్ ఇచ్చారని,ఆ పార్టీ అవుట్ డేటెడ్ పార్టీ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రప్రదమంగా కరీంనగర్లో తొలి మేయర్గా బీజేపీ అభ్యర్థి గెలవడం ప్రజల్లో మార్పు సంకేతమని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో బిజెపిపై ఏనలేని ఆదరణ పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి,మేయర్ కోలగాని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ సునీల్ రావు,బొంతల కళ్యాణ్ చంద్ర,నాయకులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర

**ప్యాడీ క్లీనర్లు వినియోగించాలి**

**సన్నరకాలు, ఆయిల్ పామ్ సాగు చేయాలి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో జిల్లా కలెక్టర్ పరిశీలన.**

తంగళ్లపల్లి, ఏప్రిల్ 30, (వాయిస్ టుడే): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల పంటలకు మద్దతు ధర లభిస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి పలు సూచనలు చేశారు. టార్పాలిన్లు, గన్ని సంచులు, నీటి వసతి, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ల ఉన్నాయా అని ఆరా తీసి.. పరిశీలించారు. ఇప్పటిదాకా ఎంత ధాన్యం వచ్చింది? సన్న రకం వడ్లు వచ్చాయా? అని అడిగి తెలుసు కున్నారు. రైస్ మిల్లుల కేటాయింపు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులు ప్యాడీ క్లీనర్లు వినియోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని రేషన్ షాప్ లు, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు సైతం సన్న బియ్యంతో సిద్ధం చేసిన భోజనం పెడుతున్నారని, సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఆయిల్ పామ్ పంట దిగుబడి విక్రయానికి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. ఎన్నో లాభాలు ఉన్న సన్న రకం వడ్లు, ఆయిల్ పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఈ పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ్ ప్రకాశ్ రావు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభం అయినా సమ్మర్ క్యాంపు

బోయినపల్లి ఏప్రిల్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి) : బోయినపల్లి మండల కేంద్ర లో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి సౌజన్యం తో జిల్లా యువజన మరియు క్రీడలా శాఖ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఈరోజు బోయినపల్లి మండల సర్పంచ్ గౌరవ శ్రీ నల్ల మోహన్ ప్రారంభించారు. విద్యార్థుల మరియు యువకులు ఈ సమ్మర్ క్యాంపు ని ఉపయోగించుకోవాలని కోరారు. ఆటలో మెలకువలు నేర్చుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ మెరుపుల చందన-జలంధర్, 6వార్డ్ సభ్యులు బొజ్జ నరేష్, యువమిత్ర యూత్ క్లబ్ అధ్యక్షులు చౌదరి శ్రీధర్, కోచ్ సంతోష్,వ్యాయామ విద్యా విద్యార్థులు బొజ్జ వెంకటేష్, బాలసాని శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



## సెస్‌ను ఎన్పీడీసీఎల్ లోకి విలీనం చేయడం అభినందనీయం

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్

బోయినపల్లి ఏప్రిల్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి) : సిరిసిల్ల విద్యుత్ సెస్ నుండి ఎన్పీడీసీఎల్ లోకి కలిపినందుకు ప్రభుత్వానికి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1970లో సిరిసిల్ల ఏరియా మెట్ట ప్రాంతం కావడంతో అప్పటి ఎమ్మెల్యే రాజేశ్వరరావు సిరిసిల్ల ప్రాంతంలోని రైతులకు మంచి నాణ్యమైన అందించాలని లక్ష్యంతో సెస్ సంస్థ ను ఏర్పాటు చేయగా రైతులకు మంచి విద్యుత్ అందిస్తూ లాభదాయకంలో ఉండగా ప్రస్తుతం ప్రస్తుతం గత కొన్ని సంవత్సరాల నుండి సెస్ లో ఉన్న పాలకులు ఇస్తాను సారంగా వ్యవహరిస్తూ సెస్ ను నష్టాల బాటలోకి నెట్టారని అన్నారు గత ప్రభుత్వంలో మద్యమాన్ని జలాశయంలో కొన్ని గ్రామాలు మునిగిపోగా అక్కడ తొలగించిన సామాగ్రికి లెక్కలు లేకుండా చేసి అమ్ముకున్నారని మండిపడ్డారు. సెస్ లో జరుగుతున్న అవినీతిని గ్రహించి కాంగ్రెస్ ప్రభుత్వం సెస్ ను ఎన్పీడీసీఎల్ లోకి కలిపి రైతులకు మేలు చేయాలని చూడడం అభినందనీయమని అన్నారు. ఎన్పీడీసీఎల్ లోకి మార్చడంతో రైతులు వినియోగదారులు ఎలాంటి ఇబ్బందు లేకుండా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, నాయకులు పిట్టల రమేష్‌లు ఉన్నారు.

వాయిస్
హైదరాబాద్
శుక్రవారం 1 మే 2026



## ‘ఉద్యమ్ రిజిస్ట్రేషన్’పై అవగాహన సదస్సు

జమ్మికుంట, ఏప్రిల్ 30 (వాయిస్ టుడే): మెప్మా ఆధ్వర్యంలో స్థానిక వినాయక గార్డెన్ లో గురువారం ‘ఉద్యమ్ రిజిస్ట్రేషన్’ ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో, టీఎల్ఎఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కరీంనగర్ పిడి స్వరూప రాణి, మున్సిపల్ చైర్ పర్సన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, వ్యాపార సంస్థల పెట్టుబడి, వార్షిక టర్నోవర్‌ను ప్రాతిపదికగా తీసుకుని వాటిని వర్గీకరిస్తూ, వ్యాపార లావాదేవీలను సులభతరం చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందడానికి ప్రతి యంఎస్ఎంఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ద్వారా శాశ్వత గుర్తింపు పొందాలని వారు సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, చిరు వ్యాపారులు దీనిని వినియోగించుకోవాలని కోరారు. వ్యాపార రంగంలో పారదర్శకత, ప్రభుత్వ చేయూత అందాలంటే ప్రతి చిన్న, మధ్య తరహా పరిశ్రమ తప్పనిసరిగా ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎంసీ శ్రీవాణి, డీపీఎం సతీష్, ఇంచార్జి టి.ఏం.సి. మల్లీశ్వరి, సీఎల్ఆర్పీలు మంజుల, జ్యోతి, ఆర్పీలు, ఓబీలు పలువురు పాల్గొన్నారు.



## ఆక్స్ ఫర్డ్ విద్యార్థుల విజయభేరి

ఖమ్మం, ఏప్రిల్ 30(వాయిస్ టుడే ): స్థానిక స్టేషన్ రోడ్ లోని ఆక్స్ ఫర్డ్ స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రిన్సిపల్ జాపర్ అలీ మతీన్ మరియు వైస్ ప్రిన్సిపాల్ అయేషా సిద్దీకా తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు నేహా శివ చందన 579 మార్కులు, బి దివ్య 574 మార్కులు, ఎస్కే ఉజ్వనా 574 మార్కులు, మీ ప్రణీత్ 572 మార్కులు, సుమయ్య ఖాతూన్ 571 మార్కులు, వైభవ్ మణికంఠ 570 మార్కులు, లక్ష్మీ చౌదరి 569 మార్కులు, ఎండి ఉస్మా అలిఫియా 567 మార్కులు, సిద్రా తంకీన్ 566 మార్కులు, నేత్ర శ్రీ 558 మార్కులు, ఎస్.కె నూరున్నిసా 557, ఎస్ కే సనా అఫ్రీన్ 557 మార్కులు, ఎండి అబ్దుల్ రావుఫ్ 553, ఎండి షైజబ్ అలీ 553, ఎస్కే ముస్కాన్ 551, ఎస్.కె వజీర్ బి 551 ఎండి ఇర్షాద్ 551, జి హిమశ్రీ 549 మార్కులు, అంజలి కుమారి 545 మార్కులు, యశ్వంత్ 544 మార్కులు, ఎస్.కె ఫర్హా 543 మార్కులు, ఎండి సఫూరా 542 మార్కులు జీషాన్ షరీఫ్ 541 మార్కులు 500 పైగా మార్కులు 54 మంది విద్యార్థులు సాధించారు. పాఠశాలలో అనుభవం అంకితభావం గల బోధనా సిబ్బంది ఉండటం వలన ఈ సంచల విజయం సాధ్యమైంది పేర్కొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను పాఠశాల ప్రిన్సిపల్ జాఫర్ మతిన్ ప్రత్యేకంగా అభినందించారు



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, ఏప్రిల్ – 30 ( వాయిస్ టుడే): జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, పూర్తయిన ఇండ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ మిటింగ్ హాల్ నందు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీజ తో కలిసి హౌజింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూలి ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 10 వేల ఇండ్లు గృహప్రవేశాలకు లక్ష్యంగా కార్యాచరణ చేసినట్లు తెలిపారు. అధికారులు లబ్ధిదారులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందించి, లక్ష్యసాధనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 9199 ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ లు వేసినట్లు, 2018 ఫీనిషింగ్ పూర్తయినట్లు కలెక్టర్ అన్నారు. జిల్లాలో మొదటి విడతగా 16497 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ అన్నారు. 2520 ఇండ్ల నిర్మాణాలు పూర్తయి, గృహ ప్రవేశాలు జరగగా, మిగతా ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులకు కావాల్సిన అన్ని సహాయ సహకారాలు అందించాలని, క్షేత్ర అధికారులు క్రియాశీలకంగా ఉంటూ, పనుల్లో రోజువారీ ప్రగతి ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు నిరంతర సమీక్షలు చేస్తూ, పనుల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తీసుకుందని, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అన్ని మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు స్లాబ్ దశలో ఉన్న ఇళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లాలోని హౌజింగ్ ఇంజనీర్లు, హౌసింగ్ ఏఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మరో అవకాశం

### – మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

జమ్మికుంట, ఏప్రిల్ 30 (వాయిస్ టుడే): రాష్ట్రంలోని ప్లాట్ల యజమానులకు తెలంగాణ ప్రభుత్వం మరో గొప్ప అవకాశం కల్పించిందని, పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) ఫీజుల చెల్లింపులపై ఏకంగా 25 శాతం భారీ రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసినట్లు కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఎల్ఆర్ఎస్ –2020 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్లాట్ యజమానులకు ఈ వెసులుబాటు ప్రభుత్వం కల్పించినట్లు ఆయన తెలిపారు. 2026 మే 1 నుంచి జులై 31వ తేదీ వరకు మూడు నెలల కాలంలో ఫీజు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం ఆయన స్పష్టం చేశారు. సాధారణ మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా పెద్ద ఊరటనిస్తూనే, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిషరించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు.

# ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల భూతాన్ని అంతం చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్ర చట్టం తీసుకురావాలి

### ఎస్.రజినీకాంత్

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు



తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్య పూర్తిగా వ్యాపారంగా మారింది ప్రభుత్వ నిబంధనను తుంగలో తొక్కుతూ తమ ఇష్టానుసారంగా అధికంగా ఫీజులు ప్రతి సంవత్సరానికి పెంచుతూ తల్లిదండ్రుల పైన అదనమైన భారం మోపుతున్నారు. విద్య అనేది ప్రాథమిక హక్కుగా ఉండాలి ఒకప్పుడు ఒక విద్యా సంస్థ ఏర్పాటు చేస్తే సేవగా భావించేవారు కానీ ఈ రోజుల్లో ఒక విద్యాసంస్థ ఏర్పాటు చేస్తే సంతలో విద్యను సరుకుగా వేలం వేస్తున్నట్టు ఫీజులు పెంచుతున్నారు,చదువు కోవాల్సిన రోజుల్లో చదువు కొనాల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఉంది ప్రభుత్వాలు ప్రైవేట్ కార్పొరేట్ ఫీజుల దోపిడీపై కేవలం మాటలకు మాత్రమే పరిమితం అవుతున్నారు కానీ ఆచరణలో ఫీజుల నియంత్ర చట్టం తీసుకురావడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు రాష్ట్ర ప్రభుత్వం ఏటా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు పెంపుపై తల్లిదండ్రులు విద్యార్థి సంఘాలు పోరాటాలు చేస్తున్న యాజమాన్యాలు వైపే ప్రభుత్వాలు ఉండడంవల్ల తమ ఇష్టానుసారంగా ఫీజులు పెంపు జరుగుతుంది, నర్సరీ నుండి ఒక విద్యార్థికి కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 వేల రూపాయలు తీసుకుంటున్నారు.ఒక విద్యార్థి ఎల్ కె జి విద్యార్థికి లక్ష రూపాయలు 1వ తరగతి నుండి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు. అదనంగా హాస్టల్ విద్యార్థులకు ఫీజు కాకుండా హాస్టల్ లక్ష పై దోపిడీ చేస్తున్నారు తెలంగాణ మధ్యతరగతి పేద బడుగు బలహీన వర్గ తల్లిదండ్రుల పైన కార్పొరేట్ ప్రవేట్ ఫీజులు భారం అధికంగా పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

### తోక పేర్ల పేరుతో ఆధానమైన ఫీజులు తల్లిదండ్రులపై భారం ఫీజులు

రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు అకాడమీకు ప్రారంభం కాకముందు ముద్దు పేర్లతో అదనంమైన ఫీజులు వసూలు చేస్తున్నారు,ఈ టెక్నో , ఒలంపియాడ్ ఐఐటి,స్మార్ట్,ఐపీఎల్, మరియు సెంట్రల్ సిలబస్ సీబీఎస్సీ కరికులం పేరుతో రాష్ట్ర బోర్డుతో నడిచే పాఠశాలల్లో వేలాది రూపాయల ఫీజులు దండుకుంటున్నారు.కేవలం అడ్మిషన్ ఫీజు 10వెల నుండి 20 వేల వరకు తీసుకుంటున్నారు, దీనికి అదనంగా ఐఐటి మరియు సీబీఎస్సీ కరికులం బుక్స్ అని 10,000 నుండి 15వేల రూపాయలు తీసుకుంటున్నారు. అదనంగా బుక్స్,నోట్ బుక్స్ ,టై, బెల్ట్, సాక్స్,యూనిఫామ్ మా పాఠశాల మాత్రమే తీసుకోవాలి వేరే పాఠశాలలో తీసుకోకూడదు అదే కాకుండా మేము చెప్పిన బుక్స్ స్టాల్ కు వెళ్లి కొనాలి అని తల్లిదండ్రులను యజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్న పరిస్థితి రాష్ట్రంలో ఉంది .ఒక విద్యార్థికి ఫీజు కాకుండా సగటున పుస్తకాలు స్టేషనరీ పేరుతో 20 వేల రూపాయల భారం తల్లిదండ్రుల పైన పడుతుంది తిరుపతయ్య కమిషన్ ప్రకారం విద్యాసంస్థలు ప్రతి సంవత్సరం ఐదు శాతం మాత్రమే లాభాలు తీసుకోవాలి కానీ ఎక్కడ కూడా ప్రభుత్వ నిబంధనలను అమలు చేయడం లేదు విజిలెన్స్ అధికారులు ప్రైవేట్ స్కూల్లో ఆర్థిక లావాదేవీలపై తనిఖీలు నిర్వహించాలి కానీ సమగ్రంగా అధికారులు తనిఖీలు చేయడం లేదు ముదుపులు ముడుతే అన్ని వసతులు ఉన్నాయని రికార్డులు చూపుతున్నారు తోక పేర్లతో పాఠశాల నడిపించొద్దని ఆదేశాలు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్న ఆదేశాలను లెక్కచేయడం లేదు తోక పేర్లు నడుస్తున్న పాఠశాలను సీజ్ చేయాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులది

### రాష్ట్రంలో జీవో నెంబర్ 37 అమలు లేదు.

రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులు దగ్గరుండి తీసుకుంటున్న ఫీజుల వివరాలు ప్రతి పాఠశాలలో నోటీస్ బోర్డ్ లో పెట్టాలి కానీ ఏ ఒక్క పాఠశాలలో రాష్ట్రంలో నోటీసు బోర్డులో ఫీజుల వివరాలు తెలియజేయడం లేదు ప్రైమెరీ విద్యార్థులకు హైస్కూల్ విద్యార్థులకు ఎంత ఫీజు తీసుకుంటున్నారు, ఫీజులకు స్ట్రక్చర్ నోటీస్ బోర్డ్ లో పెట్టాలి కానీ జీవో 37 ప్రకారం యజమాన్యాలు ఆదేశాలు అమలు చేయడం లేదు విద్య పూర్తిగా వ్యాపారం మయం అవుతుంది అక్షరాలకు లక్షల రూపాయల ఫీజుల దోపిడీ జరుగుతున్న విద్యాశాఖ అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదు తల్లిదండ్రుల పైన ఫీజుల వివరాలు తెలియజేయకపోవడం వల్ల అధరమైన భారం పడుతుంది జీవో నెంబర్ 22 ప్రకారం ప్రైమరీ అప్పల ప్రైమరీ హై స్కూల్ విద్యార్థులు బ్యాగ్స్ అధిక బరువు మోపరాదు కానీ ఒకటవ తరగతి విద్యార్థికి ఏడు నుండి 10 కేజీల బరువు ఉండే విధంగా బ్యాగ్స్ ఉంటున్నాయి పసిపిల్లలు భుజాలపైన అధిక భారం పడుతుంది. దీనివలన మానసికంగా ఇబ్బంది పడుతున్నారు,ప్రైవేట్ పాఠశాల ఆవరణంలోనే ఏ తరగతి విద్యార్థులకు ఆ తరగతి వద్దనే పుస్తకాలను స్టేషనరీ సంబంధించి ర్యాంకులు ఏర్పాటు చేయాలి అప్పుడు విద్యార్థులపై భారం తగ్గుతుంది.జీవో నెం 1 ప్రకారం ఫీజులు నియంత్రించాలి. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు ఆకాశాన్ని తాగుతున్నాయి అక్షరాలకు లక్షల రూపాయల ఫీజులు దోపిడీ జరుగుతుంది.ఎందుకు ప్రైవేట్ ఏ జమాన్యాలు ఒక విద్యా సంస్థ ఏర్పాటు చేసే ముందు ప్రతి జీవోను అమలు చేస్తామని సంతకాలు పెడతారు.కానీ విద్యాసంస్థ ప్రారంభించినాక ఏ జీవోలను అమలు చేయడం లేదు ప్రతి స్కూల్లో ఫీజులు పెంచాలి అంటే తల్లిదండ్రులతో కలిపి గవర్నమెంట్ కమిటీ ఏర్పాటు చేయాలి ఒకవేళ ఫీజులు పెంచాల్సి వస్తేతల్లిదండ్రులతో చర్చ జరిపి పెంచాలి.జిల్లా కలెక్టర్ చైర్మన్గా ఉండే డిస్టిక్ ఫీ రెగ్యులేషన్ కమిటీ,డి ఎఫ్ ఆర్ సి, సమావేశం నిర్వహించి జీవో నెంబర్ ఒకటి ప్రకారం ఫీజులను నియంత్రించాలి.కానీ ఎక్కడ కూడా అధికారులు ఫీ రెగ్యులేషన్ కమిటీ నిబంధన ప్రకారం ఫీజులు నియంత్రించడంలో చొరవ చూపడం లేదు.అదేవిధంగా జీవో నెం 91 ప్రకారం డొనేషన్ తీసుకోవడం కూడ నిషేధం ముందస్తుగా ఒక విద్యార్థి అడ్మిషన్ పొందాలంటే విద్యార్థులకు పరీక్ష నిర్వహించి పరీక్షలో తక్కువ మార్కులు వస్తే విద్యార్థుల దగ్గర నుండి అధికంగా డొనేషన్లు తీసుకుంటున్నారు ఇది చట్ట విరుద్ధం, ప్రతి ప్రవేట్ పాఠశాలలో ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలే విద్యార్థులకు బోధన చేయాలి,రాష్ట్రంలో ఫీజులను నియంత్రించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి ఫీజుల భూతాన్ని తరిమికొట్టాలి.కనీస నిబంధనలు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు నూతనంగా ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేస్తే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని అనుమతులు ఉండాలి.ముందస్తుగా పాఠశాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునేటప్పుడే అన్ని ఆధారాలతో సబ్మిట్ చేయాలి,విద్యార్థులకు సరిపడా తరగతి గదులు ఏర్పాటు చేయాలి ఆటస్థలం ఉండాలి అర్హత కలిగిన బి.ఎడ్ డీఎడ్,టీచర్లు ఉండాలి,విద్యార్థులు ఆడుకోవడం కోసం క్రీడా స్థలం ఉండాలి,ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేయాలి,పాఠశాలకు బస్సు సౌకర్యం ఉంటే ప్రతి బస్సుకు ఫిట్నెస్ ఉండాలి లేని బస్సులను ఉపయోగిస్తే యజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి, బాల బాలికలకు వేరువేరు మూత్రశాలలు ఏర్పాటు చేయాలి, మెడికల్ వసతి ఉండాలి, అసంపూర్తిగా ఉన్న భవనంలో పాఠశాల నడపరాదు,ఏదో ఒక సొసైటీ పేరు ఉండాలి,విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25శాతం ఉచిత విద్యను అందించాలి కానీ రాష్ట్రంలో ఏ ఒక్క ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఉచిత విద్యను అందించడం లేదు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి పాఠశాలలో 25 శాతంఉచిత విద్య అమలు జరిగే విధంగా చూస్తామని ప్రజాప్రతినిధులు మాట్లాడడం జరిగింది ప్రభుత్వం రాష్ట్రంలో విద్య వ్యాపారం అవుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే విద్య కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది విద్యా కమిషన్ కూడా రాష్ట్రంలో ఒక ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఏవిధంగా దోపిడీ జరుగుతుందో కూడా ప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది.అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్య వ్యవస్థను ప్రభుత్వమే బలపడే విధంగా చేస్తున్నట్టు రాష్ట్రంలో కనిపిస్తుంది ఎందుకంటే ఈ మధ్యకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక ఎమ్మెల్సీ పాఠశాలను ప్రారంభానికి ముఖ్యఅతిథిగా వెళ్లడం జరిగింది.ఆ పాఠశాలలో కేవలం ఎల్ కె జి, చదువుతున్న విద్యార్థికి 3 లక్షల నుండి 5 లక్షల వరకు ఫీజులు తీసుకుంటున్నారు అంటే విద్య ఏ విధంగా ఉందో ఈ మధ్యకాలంలోనే ఫీజులు పెంచొద్దని హైదరాబాదు భూపాలపల్లి హనుమకొండ కరీంనగర్ ప్రాంతంలో విద్యార్థుల తల్లిదండ్రులే ఫీజుల భారం అధికంగా పడుతుంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము ఫీజులు తగ్గించాలని పాఠశాల ముందు ఆందోళనలు చేయడం జరిగింది రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్పొరేట్ ప్రవేట్ ఫీజుల దోపిడీ అరికట్టాలి రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి తల్లిదండ్రుల పైన పడుతున్న ఫీజుల భారాన్ని తగ్గించాలి ఫీజుల భూతాన్ని అంతం చేయాలి విద్య అనేది ప్రాథమిక హక్కుగా ఉండాలి విద్య ఉన్నవారికి ఒక చదువు లేని వారికి ఒక చదువు ఉండకూడదు అందరికీ సమానంగా నాణ్యమైన విద్య అందించాలి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి ఫీజుల దోపిడీ అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము లేని పక్షంలో తల్లిదండ్రులు విద్యార్థులు విద్యార్థి సంఘాలు సామాజిక సంఘాలు ఏకమై ప్రభుత్వం పైన పోరాటాలు చేయక తప్పదు.




## కరీంనగర్ జిల్లాలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక ఉపాధి శిక్షణ కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

### డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్

కరీంనగర్, ఏప్రిల్ 30(వాయిస్ టుడే): జిల్లాలో నిరుద్యోగం రోజురోజుకీ భయంకర స్థాయికి చేరుకుంటోందని, యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడుతోందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.విద్య పూర్తిచేసుకున్న వేలాది మంది యువత సరైన ఉపాధి అవకాశాలు లేక ఇంటికే పరిమితమైపోతున్నారని అన్నారు.జిల్లాలో నిర్వహించిన డివైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో యువతకు మార్గదర్శకత లేకపోవడం,సరైన శిక్షణా అవకాశాలు అందుబాటులో లేకపోవడం వల్ల వారు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు.ప్రైవేట్ ట్రైనింగ్ సెంటర్లు భారీ ఫీజులు వసూలు చేస్తుండటంతో పేద, మధ్యతరగతి యువతకు శిక్షణ అందడం కష్టంగా మారిందని తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతి మండలంలో ఉచిత ఉపాధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, కంప్యూటర్ నైపుణ్యాలు,డిజిటల్ స్కిల్స్,టెక్నికల్ కోర్సులు,స్వయం ఉపాధి శిక్షణలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి ప్రతి మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.నిరుద్యోగ భృతి అమలు చేసి యువతకు ఆర్థిక భరోసా కల్పించాలి స్థానిక పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ వ్యవస్థను జిల్లా స్థాయిలో బలోపేతం చేయాలని ఆయన కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోతే,డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లాలో ఆందోళనలు చేపడతామని నరేష్ పటేల్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ యువకులు మనోజ్ కుమార్ రెడ్డి,శ్రీకాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## కార్పొరేటు కళాశాలలకు కొమ్ముకాస్తున్న ఇంటర్ బోర్డు

### బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్



కరీంనగర్, ఏప్రిల్ 30(వాయిస్ టుడే): ఇంటర్ బోర్డు అధికారులు కార్పొరేట్ కళాశాలలకు కొమ్ము కాస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలకువిరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న,అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్ కళాశాలలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూఇంటర్ బోర్డ్ కార్యాలయానికి లేఖ పంపినట్లు తెలిపారు.వేసవి సెలవుల్లో విద్యార్థులకు క్లాసులు నిర్వహించడంతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా కళాశాలలో తనిఖీలు నిర్వహించి చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ సంక్షేమ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్నామని తెలిపారు.

## నాంపల్లి గుట్టలో స్వామి వారి కళ్యాణోత్సవం



వేములవాడ, ఏప్రిల్ 30(వాయిస్ టుడే); నాంపల్లి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైశాఖ శుద్ధ చతుర్దశి సందర్భంగా ఘనం గా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించ గా ఆలయం తరఫున ఈవో శ్రీమతి రమాదేవి పట్టు వస్త్రాలు అందజేశారు.అనంతరం అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే కి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

# తీగలవంతెన నిర్మాణ పనులు వేగవంతంగా విస్తరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ఖమ్మం, ఏప్రిల్ -30 ( వాయిస్ టుడే ): ఖమ్మం మున్నేరు నది పై చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు.గురువారం ఖమ్మం కేంద్రంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, కాల్వొడ్డు తీగల వంతెన పనులు, మున్నేరు భూ నిర్వసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ వెంచర్ పురోగతి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్నేరు నది పై ఉన్న రాజీవ్ గృహకల్ప, రంగనాయక గుట్ట, ప్రకాష్ నగర్ చెక్ డ్యాం లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూలి నిపుణుల కమిటీ చేసిన డిజైన్ ల ప్రకారం మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించాలని, రెండు వైపుల నుంచి ప్రణాళికాబద్ధంగా పనులు జరగాలని అన్నారు. బైపాస్ నుంచి తీగల వంతెన వరకు మున్నేరు రిటైనింగ్ వాల్ ఎడమ, కుడి వైపుల పనులు పూర్తవ్వాలని, చిన్న, చిన్న గ్యాప్ లు కూడా ఉండకూడదని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, .మున్నేరు నదీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం రైతులకు, నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ వెంచర్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, వెంచర్ కు ప్రధాన రహదారి, అంతర్గత రోడ్డు, నగరంకు సులుభతరం చేసే విధమంగా ఓవర్ నిర్మాణం, ప్రత్యేకంగా కల్పించే వసతులతో ప్రత్యేక వెంచర్ తో భూ విలువ పెరిగి చుట్టు ప్రక్కల విస్తృతంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఖమ్మం నగరంలో మున్నేరు పై నిర్మించే కేబుల్ బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నిర్ణీత గడుపులోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే నిర్మాణపనులు వేగంగా విస్తరించాలని అన్నారు. తీగలవంతెన నిర్మాణం వల్ల ఎవరు కూడా నష్ట పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.




# కురపాటి హాస్పిటల్‌లో వైభవోపేతంగా 'ముద్దు బిడ్డ' కార్యక్రమం

## ఆడపిల్ల జననానికి అపూర్వ కానుక
## -- ఉచిత ప్రసవ సేవలు

## "బేటీ బచావో--బేటీ పఢావో" స్ఫూర్తితో కురపాటి ఫౌండేషన్ సేవా కార్యక్రమం

హనుమకొండ (వాయిస్ టుడే) : స్త్రీ ఆరోగ్య పరిరక్షణకు,బాలికా జననాన్ని ప్రోత్సహించే మహోన్నత లక్ష్యంతో కురపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కురపాటి రాధిక గురువారం కురపాటి హాస్పిటల్‌లో 'ముద్దు బిడ్డ' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ మహత్తర కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది డాక్టర్ కె.గోపికా రాణి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.గోపికా రాణి మాట్లాడుతూ స్వార్థం పెరిగిపోయిన ఈ రోజుల్లో స్వార్థం లేని మంచి మనసుతో డాక్టర్ కురపాటి రాధిక మరియు కురపాటి హాస్పిటల్ యాజమాన్యం ఆడపిల్లల పట్ల ప్రేమతో ఇంతటి బృహత్తరమైన కార్యక్రమం నిర్వహించడం పేదలపట్ల వారికున్న అభిమానం,ఆప్యాయతలు మరియు పేదరకు వారు చేస్తున్న సేవలు కనిపిస్తున్నాయని తెలిపారు. అనంతరంశడాక్టర్ కురపాటి రాధిక మాట్లాడుతూ 'ఆడపిల్ల అభ్యున్నతి--సమాజ ఉన్నతి' అనే నినాదంతో కురపాటి హాస్పిటల్‌లో ఆడపిల్లకు జన్మనిచ్చే ప్రతి తల్లికి సంపూర్ణ ఉచిత ప్రసవం మరియు ఉచిత హాస్పిటల్ సేవలు అందించనున్నట్లు సగర్వంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ శుభవేళనే ఇద్దరు పండంటి ఆడపిల్లలు ఈ పథకం ద్వారా ఉచితంగా జన్మించారు. తల్లులు,పసికందులు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. "బేటీ బచావో--బేటీ పఢావో" స్ఫూర్తితో కురపాటి ఫౌండేషన్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమం హనుమకొండ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని పలువురు ప్రముఖులు కొనియాడారు.

# త్వరలోనే శాతవాహన వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు



హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం హుస్నాబాద్ మండలం పోతారం ఎస్, ఉమ్మాపూర్ గ్రామాల శివారులో ఈ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. భూమి కేటాయింపు పత్రాలను యూనివర్సిటీ బీసీ ఉమేష్ కుమార్‌కు అందించారు. ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, టెండర్ కూడా పూర్తయిందన్నారు. కళాశాలతోపాటు హాస్టల్ భవనాలు కూడా నిర్మిస్తారని మంత్రి చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇక్కడి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఈ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. అదేవిధంగా గాంధీనగర్‌లోని పాలిటెక్నిక్ ఆవరణలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన స్థల కేటాయింపు పత్రాలను సంబంధిత అధికారులకు అందించారు. కూచనాపల్లి - మాలపల్లి గ్రామాల మధ్య న్యాక్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, దానికి సంబంధించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. మంత్రి వెంట మున్సిపల్ ఛైర్మన్ దండి లక్ష్మి, ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సతీష్ కుమార్, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బంక చందు, సర్పంచులు చొప్పరి ప్రశాంత్, వెన్న స్వర్ణలత, వేల్పుల సంపత్ కుమార్ ఉన్నారు.

# త్రివేణి విద్యార్థులను అభినందించిన కలెక్టర్, డి ఈ ఓ



ఖమ్మం, ఏప్రిల్ 30 ( వాయిస్ టుడే): 2025 పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రివేణి విద్యార్థులను ఖమ్మం జిల్లా కలెక్టర్ టి ఎస్ దివాకర, డి ఈ ఓ చైతన్య జైనీ గారు అభినందించారు. ఏప్రిల్ 30వ తేదీ కలెక్టర్ కార్యాలయం, మరియూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మరియూ డి ఈ ఓ గారి ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కలెక్టర్ మరియూ డి ఈ ఓ గారు అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సహకారంతో విద్యార్థులు చేసిన ఉత్తమ కృషి ఫలితంగానే ఈ ఫలితాలను సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కలెక్టర్ మరియూ డి ఈ ఓ కు వివరించారు.నగరంలోని త్రివేణి పాఠశాలకు సంబంధించి పరీక్షకు హాజరైన విద్యార్థులలో 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి హరిచందన, హర్షవర్ధన్ ఇద్దరూ టాప్ ప్లేస్ లో నిలిచారని అలాగే వరుసగా దేవీ వెంకట్ సాయి 585, అఖిల్,రోహన్ సాయి 583మార్కులు, శ్యాంశ్రీ ,రిషిత 582 మార్కులు, సాయి దీక్షిత్, రోహిత్ కృష్ణ 581 సాధించి టాప్ ప్లేస్ లో నిలిచారని తెలిపారు. అలాగే 570 కి పైగా 18 మంది విద్యార్థులు 560 కి పైగా 37 మంది విద్యార్థులు, 550 కి పైగా 52 మంది విద్యార్థులు 500 మందికి పైగా 159 మంది విద్యార్థులు, 70% విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని తెలియజేశారు. ఈ సందర్భంగా త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి విద్యార్థులు సాధించిన విజయాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంకిత భావం గల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థుల నిరంతర పరిశ్రమ కారణంగానే ఉత్తమ ఫలితాలు సాధించగలిగామని ఆయన అన్నారు.ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎస్ఎస్సి లో టాప్ గ్రేడ్లు,మార్కుల సాధనకే పరిమితం కాక జాతీయస్థాయి పోటీ పరీక్షలైన ఐఐటి, నీట్ , జె ఎస్ ఓ, ఎన్ టి ఎస్ సి ఒలంపియాడ్ వంటి రేపటి పోటీ పరీక్షల్లో కూడా విజయం సాధించేలా పటిష్టమైన పునాదిని ఏర్పరుస్తుందని వారి ఉజ్వల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు త్రివేణి పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ ,పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ,ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, ట్రాన్స్ఫోర్ట్ ఇంచార్జ్ సందీప్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పేదల ఇళ్లు, పట్టాల పంపిణీపై వెనక్కి తగ్గేదే లేదు

## - ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజురాబాద్, ఏప్రిల్ 30 (వాయిస్ టుడే): హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, పేదల ఇళ్లు, రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గళమెత్తారు. గురువారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావుల సమక్షంలో నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను ఏకరువు పెట్టారు. నిర్మాణం పూర్తయిన 2బి హెచ్ కె ఇళ్లను వెంటనే పంపిణి చేయాలన్నారు. జమ్మికుంట టౌన్, ధర్మారం, బూజునూర్, కమలాపూర్, గూడూరు, మర్రిపెల్లిగూడెం, కోర్కల్, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ఇప్పటికే వందశాతం పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చిన్నకోమటిపల్లి, పోతిరెడ్డిపేట, విలాసాగర్ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

## జర్నలిస్టుల పట్టాలు, సైదాబాద్ భూ సమస్యలపై ధ్వజం..

హుజురాబాద్‌లో జర్నలిస్టులకు గతంలో కేటాయించిన పట్టా భూములను వెంటనే మంజూరు చేయాలని, వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని స్పష్టం చేశారు. జమ్మికుంట మండలం సైదాబాద్‌లో పేదలకు కేటాయించిన పట్టాలను తక్షణమే పంపిణీ చేయాలని కోరారు. వీణవంకలోని సమ్మక్క-సారలమ్మ జాతర భూములను దేవాదాయ శాఖకు అప్పగించాలని విన్నవించారు. హుజురాబాద్ పట్టణ ప్రజల ఆరోగ్య దృష్ట్యా ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని కోరుతూ మంత్రులకు వినతి పత్రం సమర్పించారు. మౌలిక సదుపాయాలు..సొంత భవనాలు లేని ఇల్లంతకుంట మండలంలోని తహసీల్దార్ ఎంపీడీవో కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్ భవనాలను మంజూరు చేయాలని కోరారు. కాలువలు తెగిపోవడం వల్ల 8,000 ఎకరాలకు సాగునీరు అందడం లేదని, 70 కోట్ల అంచనాతో సిద్ధంగా ఉన్న డిపి ఆర్ ను ఆమోదించి పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి విన్నపాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఇందిరమ్మ ఇళ్లు మరియు 2 బి హెచ్ కె గృహాల కేటాయింపులో స్థానిక ఎమ్మెల్యేల సూచనలకే వంద శాతం ప్రాధాన్యత ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా హామీఇచ్చారు.హుజురాబాద్ నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.




# ఎస్ ఎస్ సి 2026 పరీక్ష ఫలితాలలో కివీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

వరంగల్ ( వాయిస్ టుడే ) ఏప్రిల్ 30 : ఇటీవల విడుదలైన ఎస్ఎస్సి 2026 పరీక్షా ఫలితాలలో కివి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో అత్యధిక మార్కులు సాధించి మరోసారి నెంబర్ వన్ స్థానంలో నిలిపి స్కూల్ కు మరింత గౌరవం తెచ్చారని పాఠశాల ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి ఒక ప్రకటన ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో అత్యధిక మార్కులు సాధించిన పూల మనోజ్ఞ 579 మార్కులు , రాచర్ల లక్ష్మీ ప్రసన్న 578 మార్కులు, పెయింటకర్ జశ్విత 575 మార్కులు, శివరాత్రి అశ్విన్ కుమార్ 568, బూర అనుదీప్ 566 మార్కులు, బొల్లం యశ్వంత్ 554, బసవరాజు సహస్ర 553, ఆకు తోట మేఘన 552, క్షీరసాగర్ సాహితి 550, బోద్దని పావని 549, కోడం ఆరూప్యాంజలీ 548, జడల వైశాలిని 547 మార్కులు సాధించారు.

మొత్తంగా 500కు పైగా మార్కులు 34 మంది విద్యార్థులు సాధించగా ప్రతి సబ్జెక్టులో 99 లేదా 100 మార్కులు సాధించి అండర్ రైల్వే గేట్ ప్రాంతం లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులను పాఠశాల యజమాన్యం వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్ పాఠశాల డైరెక్టర్ దాసిరజని అధ్యాపక బృందం పూజారి మురళి, కే శ్రీధర్,బి శాంతకుమారి, జి రాకేష్,ఎం రమేష్ బాబు, మరియు రజనీష్ ఇతర అధ్యాపక బృందం పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



# మల్లూరు గుట్టపై ధ్వజారోహణం

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గుట్టపై వెలసిన శ్రీహేమాచల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం గుట్టపై అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, వేణుగోపాలస్వామికి స్నపనం, గరుడ ప్రసాద వితరణ, శ్రీకృష్ణ సహస్ర నామార్చన, సాయంత్రం దేవతాహ్వానం, భేరిపూజ, బలి హరణం, నివేదన కార్యక్రమాలు చేశారు. సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదాన్ని అందజేశారు. గర్భగుడిలోని లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్‌కు రజతాభరణాలతో అలంకరించి పూజించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**